RNI NO.TELTEL/2023/12249

# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in




సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 235 | పేజీలు : 08 | శుక్రవారం | 04-09-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.

# బ్లాక్‌మెయిల్ చేసి బర్తరఫ్ చేయించారు

## కొండా సురేఖ

- హైకమాండ్‌ను రేవంత్ రెడ్డి బ్లాక్‌మెయిల్ చేసి నన్ను బర్తరఫ్ చేయించారు : కొండా సురేఖ
- తన కుమార్తె వ్యాఖ్యలకు నన్నెలా బాధ్యురాలిని చేస్తారని నిలదీత
- రాజీనామా చేయమని నన్నెవరూ అడగలేదని వివరణ
- అధిష్ఠానానికి ఇచ్చిన లేఖను మీడియాకు ఇచ్చిన కొండా సురేఖ



హైదరాబాద్ పల్స్,డెస్క్

మంత్రివర్గం నుంచి తనను బర్తరఫ్ చేయాలన్న నిర్ణయంపై కొండా సురేఖ స్పందించారు. తనని మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయడాన్ని ఖండించారు. నిర్ణయానికి ముందు తన వివరణ తీసుకోవాల్సిందని తెలిపారు. తన కుమార్తె వ్యాఖ్యలకు తననెలా బాధ్యురాలిని చేస్తారని ప్రశ్నించారు. తన కుమార్తె స్వతంత్ర మహిళ అని, ఆమె వ్యాఖ్యలు ఆమెవేనని పేర్కొన్నారు. మీడియాకు ఇచ్చిన నోట్‌లో ఊరు, పేరు లేదు.

**రేవంత్ రెడ్డి పట్టుబట్టి**

ఉరిశిక్ష పడిన ఖైదీని కూడా చివరి కోరిక అడుగుతారన్న కొండా సురేఖ తనను మాత్రం ఏ వివరణ అడగకుండానే తొలగించారని, తనను ఇలా ఏకపక్షంగా తొలగించటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తనను తొలగించడం అధిష్ఠానానికి కూడా ఇష్టం లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పట్టుబట్టి తనని బర్తరఫ్ చేయిస్తున్నారని, 'బర్తరఫ్ చేస్తారా? నన్ను వెళ్లిపోమ్మంటారా' అని అధిష్ఠానాన్ని బ్లాక్‌మెయిల్ చేశారని ఆమె ఆరోపించారు.తన మీద, తన మాజీ ఓఎస్డీ మీద కుట్రలు చేస్తున్నారని, దీని వెనక వేం నరేందర్‌రెడ్డి, పొంగులేటి, కొండల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, మరికొందరు ఉన్నారన్నారు. అందరూ కలిసి కావాలని కక్షగట్టి నన్ను, సుమంత్ కుటుంబాన్ని వేధించారని విమర్శించారు. సుమంత్‌పై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.మంత్రిగా తనకు ఎలాంటి అధికారాలు లేకుండా చేశారని, తన ప్రమేయం లేకుండానే తన శాఖలో నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపించారు. తనకు తెలియకుండా తన ఓఎస్డీ



## ధమ్కీ ఇచ్చి భయపెట్టలేరు

### సీఎం రేవంత్

హైదరాబాద్ పల్స్,డెస్క్

చంచల్‌గూడ-సంతోష్‌నగర్ స్టీల్ ఫ్లైఓవర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో హైదరాబాద్ అభివృద్ధి, మెట్రో విస్తరణ, మౌలిక వసతులు, పేదల సంక్షేమంపై సీఎం పలు కీలక ప్రకటనలు చేశారు. గత ప్రభుత్వం కేవలం కొబ్బరికాయ కొట్టి ఫ్లైఓవర్ నిర్మాణాన్ని పట్టించుకోలేదని రేవంత్ రెడ్డి



## మద్రాస్ హైకోర్టులో స్టాలిన్‌కు ఎదురుదెబ్బ

- కొలత్తూర్ నియోజకవర్గంలో ఓటమిపాలైన స్టాలిన్
- ఈవీఎంలు, వీవీపాట్‌లలో అక్రమాలు జరిగాయంటూ పిటిషన్
- పిటిషన్ విచారణార్హం కాదన్న ధర్మాసనం



## బాత్‌రూమ్‌కు వెళ్లినా మాకు తెలిసిపోతుంది

- 'వాళ్లు బాత్‌రూమ్‌కు వెళ్లినా మాకు తెలిసిపోతుంది'..
- ఇరాన్‌పై ట్రంప్ సంచలన వ్యాఖ్యలు
- ఇరాన్‌పై అమెరికా నిఘా పూర్తిస్థాయిలో ఉందన్న ట్రంప్
- అవసరమైతే మరోసారి దాడి చేస్తామని హెచ్చరిక
- హర్మూజ్‌పై తమకు బలమైన పట్టు ఉందని వెల్లడి
- ఇరాన్ తాజా దాడుల్లో 18 మంది మృతి అమెరికా స్థావరాలపై ఇరాన్ ప్రతిదాడులు

హైదరాబాద్ పల్స్,డెస్క్

అమెరికా-ఇరాన్ మధ్య మరోసారి ఉద్రిక్తతలు పెరిగాయి. ఇరాన్‌పై తమ నిఘా ఎంత పకడ్బందీగా ఉందో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. ఇరాన్‌లో ఏం జరుగుతుందో తమకు ఎప్పటికప్పుడు తెలుస్తోందన్నారు. అవసరమైతే ఎప్పుడైనా మరో దాడి చేసేందుకు అమెరికా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఓవల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడిన ట్రంప్.. తాజా ఘర్షణ ఎక్కువ కాలం సాగదని అభిప్రాయపడ్డారు. ఇరాన్ కదలికలపై అమెరికాకు పూర్తి సమాచారం ఉందన్నారు. "వాళ్లు బాత్‌రూమ్‌కు వెళ్లినా మాకు తెలిసిపోతుంది" అంటూ అమెరికా నిఘా సామర్థ్యాన్ని వివరించారు.హర్మూజ్ జలసంధిపై తమకు

## ఏ దేశమూ ఇరాన్‌కు సహాయం చేయకూడదు

### ఇరాన్‌తో వాణిజ్యంపై భారత్‌కు అమెరికా పరోక్ష హెచ్చరిక!



హైదరాబాద్ పల్స్,డెస్క్

ఇరాన్‌తో భారత్ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోబోతోందన్న వార్తలను అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కొట్టిపారేశారు. అయితే, అమెరికా ఆంక్షలను తప్పించుకోవడానికి ఇరాన్‌కు ఏ దేశం సహకరించినా, ఆ దేశం కూడా తీవ్రమైన ఆంక్షలను ఎదుర్కోవాల్సి

- భారత్-ఇరాన్ మధ్య వాణిజ్య ఒప్పందం వార్తలను ఖండించిన అమెరికా
- ఇరాన్‌కు సాయం చేసే దేశాలపై ఆంక్షలు విధిస్తామని మార్కో రూబియో హెచ్చరిక
- ప్రధాని మోదీ, ఇరాన్ అధ్యక్షుడు భేటీ అయిన నేపథ్యంలో అమెరికా వ్యాఖ్యలు
- ఇరాన్‌ను అణుశక్తిగా మారకుండా నిరోధించడమే తమ లక్ష్యమన్న ట్రంప్ సర్కార్
- అమెరికాను ఎదుర్కొనేందుకు కొత్త వ్యూహంతో వస్తున్నామన్న ఇరాన్



## బీసీ మహిళ కాబట్టే వేటు వేశారు

### కొండా సురేఖ బర్తరఫ్ పై శ్రీనివాస్ గౌడ్

- కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించాలనుకోవడం దారుణమన్న శ్రీనివాస్ గౌడ్
- ఈ కఠిన నిర్ణయం వెనుక బీసీ వ్యతిరేక ఆలోచన ఉందని మండిపాటు
- ఎంతోమంది కాంగ్రెస్ నేతలు రేవంత్ కు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని వ్యాఖ్య

## అధిష్ఠానం నిర్ణయమే అంతిమం

- కొండా సురేఖ వ్యవహారంపై రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు
- కొండా సురేఖ వివాదంపై స్పందించిన మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి
- ఈ విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయమే అంతిమమని స్పష్టీకరణ
- కొండా సురేఖ చేసిన తప్పుల రికార్డు హైకమాండ్ వద్ద ఉందని వ్యాఖ్య
- పార్టీ తీసుకునే నిర్ణయానికి ఆమె కట్టుబడి ఉండాలని సూచన

హైదరాబాద్ పల్స్,డెస్క్


తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిన మంత్రి కొండా సురేఖ వ్యవహారంపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పందించారు. ఈ విషయంలో పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయమే అంతిమమని, దానికి అందరూ కట్టుబడి ఉండాలని స్పష్టం చేశారు.మునుగోడులో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం



## 2027 వరకు ఎల్‌నినో..

### డబ్ల్యూఎంఓ సంచలన హెచ్చరిక.. భారత్‌కు మరో వాతావరణ ముప్పు

- 100 శాతం కొనసాగింపు అవకాశముందని డబ్ల్యూఎంఓ అంచనా
- 2026 చివరికి తీవ్ర స్థాయికి చేరే అవకాశం
- పసిఫిక్ సముద్రంలో అసాధారణ వేడి
- భారత్‌లో ఇప్పటికే 16 శాతం వర్షపాతం లోటు
- దేశంలో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం
- వ్యవసాయం, నీటి వనరులపై ఒత్తిడి ముప్పు




హైదరాబాద్ పల్స్,డెస్క్

వాతావరణ మార్పులపై 'ప్రపంచ వాతావరణ సంస్థ' (డబ్ల్యూఎంఓ) కీలక హెచ్చరిక చేసింది. పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో ప్రభావం వేగంగా బలపడుతోందని తెలిపింది. ఈ ఏడాది చివరి నాటికి ఇది చాలా తీవ్ర స్థాయికి చేరుకునే అవకాశం ఉందని పేర్కొంది. అంతేకాదు.. ఎల్‌నినో ప్రభావం 2027 ఫిబ్రవరి వరకు కొనసాగేందుకు 100 శాతం అవకాశం ఉందని తాజా అంచనాలో వెల్లడించింది.సెప్టెంబర్ 3న విడుదల చేసిన తాజా

## ప్రపంచానికి కొత్త అవకాశాలు

- భారత ఆర్థిక వృద్ధి వల్ల ప్రపంచానికి కొత్త అవకాశాలు: ప్రధాని మోదీ
- ఉక్రెయిన్, పశ్చిమాసియాలో ఘర్షణలకు త్వరగా ముగింపు
- పలకాలన్న ప్రధాని మోదీ భారత్, బెల్జియం మధ్య కీలక ఒప్పందాలు



హైదరాబాద్ పల్స్,డెస్క్

ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక, ఆర్థిక అనిశ్చితులు కొనసాగుతున్న వేళ భారత్, బెల్జియం ద్వైపాక్షిక సంబంధాలను మరింత వ్యూహాత్మక స్థాయికి తీసుకెళ్లాలని నిర్ణయించాయి. ప్రధాని నరేంద్ర మోదీ, బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ మధ్య గురువారం విస్తృత చర్చలు జరిగాయి. అందులో వాణిజ్యం, రక్షణ, కీలక ఖనిజాలు, క్లీన్ ఎనర్జీ,

## మద్రాస్ హైకోర్టులో స్టాలిన్‌కు
# ఎదురుదెబ్బ

మొదటి పేజీరువాయి

తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎం.కే. స్టాలిన్‌కు మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తన సొంత నియోజకవర్గమైన కొలత్తూర్‌లో ఎదురైన ఓటమిని సవాలు చేస్తూ... ఈవీఎంలు, వీవీపాట్ స్లిప్పుల రీ-కౌంటింగ్ నిర్వహించి ప్రత్యర్థి విజయాన్ని రద్దు చేయాలని ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు, అది విచారణార్హం కాదంటూ కొట్టివేసింది.వివరాల్లోకి వెళితే... కొలత్తూర్ శాసనసభ నియోజకవర్గంలో టీవీకే అభ్యర్థి వి.ఎస్. బాబు చేతిలో 8,795 ఓట్ల తేడాతో స్టాలిన్ పరాజయం పాలయ్యారు. అయితే ఈవీఎంలు, వీవీపాట్‌లలో అక్రమాలు జరిగాయని, కొన్ని యంత్రాలు అభ్యర్థి పేరును కూడా గుర్తించడంలో విఫలమయ్యాయని ఆరోపిస్తూ స్టాలిన్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. 100 శాతం వివిపాట్ స్లిప్పులను లెక్కించి, తనను విజేతగా ప్రకటించాలని కోర్టును కోరారు.అయితే కేంద్ర ఎన్నికల సంఘం తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాదులు.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 329(ఎ), ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం ఎన్నికల ఫలితాలను కేవలం 'ఎలక్షన్ పిటిషన్' ద్వారా మాత్రమే సవాలు చేయాల్సి ఉంటుందని, సాధారణ రిట్ పిటిషన్ ద్వారా కాదని స్పష్టం చేశారు. ఈ వాదనలతో ఏకీభవించిన మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్.ఎ. ధర్మాధికారి, జస్టిస్ జి. అరుళ్ మురుగన్‌లతో కూడిన ధర్మాసనం స్టాలిన్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను కొట్టివేస్తూ తుది తీర్పు వెలువరించింది.

## ఏ దేశమూ ఇరాన్‌కు
# సహాయం చేయకూడదు

మొదటి పేజీరువాయి

వస్తుందని ఆయన గట్టిగా హెచ్చరించారు. కిర్గిజ్‌స్థాన్‌లోని బిష్కెక్‌లో జరిగిన 26వ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో భేటీ అయిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి."భారత్, ఇరాన్ మధ్య వాణిజ్య ఒప్పందం ఉందని నేను అనుకోవడం లేదు" అని రూబియో ఓ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. అయితే, ప్రపంచంలోని చాలా దేశాలు తమ విదేశాంగ విధానాలను స్వతంత్రంగా రూపొందించుకుంటాయని, ఇరాన్‌తో సంప్రదింపులు జరుపుతాయని ఆయన అంగీకరించారు. అవసరమైనప్పుడు ఇరాన్ ప్రభుత్వ ప్రతినిధులతో తాము కూడా చర్చలు జరిపినట్లు ఆయన గుర్తుచేశారు.

**ఆంక్షల విషయంలో వెనక్కి తగ్గేది లేదు**

అదే సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతంలో చేసిన హెచ్చరికను రూబియో పునరుద్ఘాటించారు. "అమెరికా ఆంక్షలను తప్పించుకోవడానికి ఇరాన్‌కు ఏ దేశం సాయం చేయకూడదు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడానికి, అణ్వాయుధాన్ని నిర్మించడానికి అవసరమైన ఆదాయాన్ని సమకూర్చుకునే మార్గాలను ఇరాన్‌కు కల్పించకూడదు. ఒకవేళ ఏవైనా దేశాలు అలా చేస్తే, వాటిపై కూడా మేము ఆంక్షలు విధించాల్సి వస్తుంది" అని రూబియో హెచ్చరించారు.

**ఇరాన్‌కు అణ్వస్త్రం దక్కనివ్వం**

ట్రంప్ యంత్రాంగం ప్రధాన లక్ష్యం ఇరాన్‌ను అణ్వాయుధ శక్తిగా మారకుండా నిరోధించడమేనని రూబియో స్పష్టం చేశారు. "అధ్యక్షుడిగా ట్రంప్ ఉన్నంత కాలం ఇరాన్‌ను అణ్వస్త్ర దేశంగా మారేందుకు ఎప్పటికీ అనుమతించం" అని ఆయన అన్నారు. ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ప్రాథమికంగా ఆర్థిక ఆంక్షలను ఉపయోగిస్తామని, అయితే అవసరమైతే సైనిక చర్యకు కూడా వెనుకాడబోమని ఆయన తెలిపారు. ఇరాన్ తన ఆర్థిక వనరులను దేశ ప్రజల సంక్షేమానికి కాకుండా ఉగ్రవాదం, అణ్వాయుధాల కోసమే ఖర్చు చేస్తోందని రూబియో ఆరోపించారు.గత ఆరు నెలలుగా పశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇటీవలి వారాల్లో ఇరు దేశాల మధ్య ఘర్షణలు పెరిగాయి. ఇరాన్ లక్ష్యాలపై రాత్రికి రాత్రే భారీ దాడులు చేశామని, అవసరమైతే మరోసారి దాడికి సిద్ధంగా ఉన్నామని అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. మరోవైపు, ఇరాన్ కూడా వెనక్కి తగ్గడం లేదు. తమ దేశం యుద్ధరంగంలో, దౌత్యపరంగా, ఆర్థిక దిగ్బంధనాన్ని ఎదుర్కోవడంలో కొత్త వ్యూహాన్ని అవలంబించిందని ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ మొహసెన్ రెజాయీ హెచ్చరించారు. తమ కొత్త వ్యూహం అమెరికా పునాదులను కదిలిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.

## బాత్‌రూమ్‌కు వెళ్లినా మాకు
# తెలిసిపోతుంది

మొదటి పేజీరువాయి

బలమైన పట్టు ఉందని ట్రంప్ పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ఇరాన్ ఏర్పాటు చేస్తున్న రాడార్, క్షిపణి వ్యవస్థలను అమెరికా గుర్తించిందన్నారు. సముద్రంలో మైన్స్ వేసేందుకు ఇరాన్ సిద్ధం చేస్తున్న రాకెట్‌ను దాడిలో ధ్వంసం చేశామని చెప్పారు. తాజా అమెరికా దాడుల్లో ఇరాన్‌లో కనీసం 18 మంది చనిపోయారు. మరో 108 మంది గాయపడ్డారు. హర్మూజ్ సమీపంలోని కుహెస్తాక్‌లో జరిగిన వివాహ వేడుకపై కూడా దాడి జరిగినట్లు టెహ్రాన్ తెలిపింది. అమెరికా దాడులకు ప్రతిగా ఇరాన్ కూడా ఎదురుదాడులకు దిగింది. కువైట్, జోర్డాన్, యూఏఈ, బహ్రెయిన్, ఇరాక్‌లోని కుర్దిస్థాన్ ప్రాంతాల్లో ఉన్న అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది. కువైట్‌లో ఇరాన్ నుంచి వచ్చిన క్షిపణి, డ్రోన్ దాడిని అడ్డుకున్నట్లు అక్కడి సైన్యం తెలిపింది.

## బీసీ మహిళ కాబట్టే
# వేటు వేశారు

మొదటి పేజీరువాయి

తెలంగాణ కేబినెట్ నుంచి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను బర్తరఫ్ చేయాలనే అంశంపై ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకత్వం తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. ఒక బీసీ మహిళా మంత్రిని పదవి నుంచి తొలిగించాలనుకోవడం దారుణమని, కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 1000 రోజుల పాలనకు నిరసనగా నారాయణపేట జిల్లా కోస్గిలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన 'బీఆర్ఎస్ రైతు గర్జన' సభలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు.కాంగ్రెస్ పార్టీలో ఎంతోమంది ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు నిత్యం ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా బహిరంగంగానే మాట్లాడుతున్నారని, కానీ కేవలం ఓ బీసీ మహిళా నాయకురాలిని మాత్రమే లక్ష్యంగా చేసుకుని పదవి నుంచి తొలగించడం కాంగ్రెస్ వైఖరికి అద్దంపడుతోందని శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. సొంత పార్టీ మంత్రుల్లో కొందరికి ఒక న్యాయం, కొండా సురేఖకు మరొక న్యాయమా? అని నిలదీశారు. ప్రస్తుత కేబినెట్‌లోని పలువురు మంత్రులపై అవినీతి, కమీషన్ల ఆరోపణలు వెల్లువెత్తుతున్నా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోని ప్రభుత్వం, సురేఖ విషయంలో మాత్రం ఇంత కఠినంగా వ్యవహరించడం వెనుక బీసీ వ్యతిరేక ఆలోచనా ధోరణి ఉందని ధ్వజమెత్తారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీసీలను అనేక రకాలుగా మోసం చేస్తూ వస్తోందని, పదవుల తొలగింపులోనూ బడుగు, బలహీన వర్గాల నేతలనే బలిపశువులను చేస్తున్నారని విమర్శించారు. కొండా సురేఖ ఉద్వాసన కాంగ్రెస్ పార్టీ అంతర్గత విషయమైనప్పటికీ, ఒక బలమైన బీసీ నాయకురాలికి జరిగిన ఈ అన్యాయాన్ని ప్రజలు, బీసీ వర్గాలు గమనిస్తున్నాయని అన్నారు.

## బ్లాక్‌మెయిల్ చేసి
# బర్తరఫ్ చేయించారు

మొదటి పేజీరువాయి

సుమంత్‌ను తప్పించారని, అభివృద్ధి విషయంలో తన నియోజకవర్గంపై వివక్ష చూపారని విమర్శించారు. తన శాఖలోని అంశాలపై కడియం శ్రీహరి జోక్యం చేసుకున్నారని, తన శాఖలోని అధికారులతో కడియం సమీక్షలు నిర్వహించారని తెలిపారు.

**ప్రజల్లో వ్యతిరేకత ఉంది**

మంత్రులందరూ సంతోషంగా ఉన్నారా? గుండెల మీద చెయ్యి వేసుకుని చెప్పాలని సురేఖ కోరారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవరూ సంతోషంగా లేరనే విషయం అందరికీ తెలుసనని తెలిపారు. ఇప్పటికైనా అందరూ బయటికి వచ్చి ధైర్యంగా మాట్లాడాలని సూచించారు. ప్రజలకు సేవ, అభివృద్ధి చేయలేకపోతున్నామనే బాధ అందరిలో ఉందని, పనుల జరగాలంటే ఎవరివద్దకు వెళ్లాలో తెలియని స్థితిలో ఎమ్మెల్యేలు ఉన్నారని ఆరోపించారు. ఇస్తామన్న హామీలు నెరవేర్చకపోవటం వల్ల ప్రజల్లో వ్యతిరేకత ఉందని స్పష్టం చేశారు.

**ఎమ్మెల్యేగా కొనసాగుతా?**

క్షేత్రస్థాయి పరిస్థితిపై ప్రభుత్వం సర్వే చేయించుకుంటే మంచిదని సూచించారు. తాను పునరాలోచించుకోమని చెప్పనని, పార్టీ తీరు మారాల్సిన అవసరం ఉందని తెలిపారు. మళ్లీ కాంగ్రెస్ పార్టీ గెలవాలంటే చాలా మార్పులు చేసుకోవాలని, రేవంత్ రెడ్డి ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదని హితవు పలికారు. తనవైపు ఒక వేలు చూపితే రేవంత్‌రెడ్డి వైపు నాలుగువేళ్లు చూపుతాయని ఎద్దేవా చేశారు. ప్లాన్-బిపై ఇంకా ఏమీ ఆలోచించుకోలేదనిఎమ్మెల్యేగా కొనసాగుతానని, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసే ఆలోచన లేదని స్పష్టం చేశారు.

**ఇంకా ఆలోచించుకోలేదు**

తన కుమార్తె వ్యాఖ్యలను తాను ఖండించాల్సిన అవసరం లేదన్న సురేఖ తన కుమార్తె వ్యక్తిగత అభిప్రాయాన్ని తప్పుపట్టే అధికారం తనకు లేదని స్పష్టం చేశారు. అధిష్ఠానానికి తాను ఇచ్చిన లేఖను మీడియాకు ఇస్తున్నానని, భవిష్యత్ కార్యాచరణపై ఇంకా ఆలోచించుకోలేదని తెలిపారు. జగ్గారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలపై ఏం నిర్ణయం తీసుకున్నారని ఆమె నిలదీశారు.

**రేవంత్ రెడ్డి ఆత్మపరిశీలన చేసుకోవాలి**

తాను తప్పు చేయలేదని, తనకు పశ్చాత్తాపం లేదని కొండా సురేఖ వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. వైఎస్ఆర్ తర్వాత రేవంత్ రెడ్డినే ఎక్కువ అభిమానించానని, రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడు, సీఎం కావాలని తానే ముందు కోరుకున్నానని పేర్కొన్నారు.

**సంతోషంగా ఉంది**

తనపై కక్షపూరితంగా చర్యలు తీసుకున్నారని భావిస్తున్నానన్న కొండా సురేఖ తన వల్ల ముగ్గురు బీసీ మహిళలకు పదవులు రావటం సంతోషకరమని తెలిపారు. తన కోసం చిన్నారెడ్డిపై వేటు వేయటం సరికాదని అభిప్రాయపడ్డారు.

## ధమ్కీ ఇచ్చి
# భయపెట్టలేరు

మొదటి పేజీరువాయి

విమర్శించారు. బ్రిడ్జి నిర్మాణానికి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని ఆరోపించారు. ప్రజా ప్రభుత్వం నిధులు కేటాయించి పనులను పూర్తి చేసిందని తెలిపారు.

**'ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ'**

పాతబస్తీపై సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తాను గతంలోనే చెప్పినట్లు ఇది ఓల్డ్ సిటీ కాదని.. 'ఒరిజినల్ సిటీ' అని అన్నారు. ఇక్కడి ప్రతి గల్లీ తనకు తెలుసని పేర్కొన్నారు. అసదుద్దీన్ ఓవైసీ కోరిన అభివృద్ధి పనులను మంజూరు చేయాలని అధికారులను ఈ వేదికగా ఆదేశిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే అబ్దుల్లా బలాలా.. కళాశాల అభివృద్ధికి రూ.20 కోట్లు కోరగా.. రూ.25 కోట్లు మంజూరు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. ప్రభుత్వం నిధులు ఇస్తుందని, అయితే ఏడాదిన్నరలోపు అభివృద్ధి పనులు పూర్తి చేసే బాధ్యత ఎమ్మెల్యేదేనని స్పష్టం చేశారు. విద్య కోసం ఎంత ఖర్చు చేయడానికైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

## ప్రపంచానికి కొత్త
# అవకాశాలు

మొదటి పేజీరువాయి

అధునాతన సాంకేతికత వంటి అంశాలపై ప్రధానంగా చర్చించారు. రెండు దేశాల మధ్య సహకారాన్ని మరింత విస్తరించేందుకు పలు నిర్ణయాలు తీసుకున్నారు. చర్చల అనంతరం నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో ప్రధాని మోదీ ప్రపంచ పరిస్థితులు, భారత్ ఆర్థిక ప్రగతి, శాంతి-భద్రత వంటి అంశాలపై మాట్లాడారు. ప్రస్తుతం ప్రపంచం తీవ్ర మార్పులు, అనిశ్చితితో కూడిన పరిస్థితులను ఎదుర్కొంటోందని అన్నారు.ఆహారం, ఇంధనం, సరఫరా వ్యవస్థల నుంచి దాదాపు ప్రతి రంగంపైనా అంతర్జాతీయ పరిణామాల ప్రభావం పడుతోందని మోదీ పేర్కొన్నారు. పలు ప్రాంతాల్లో ఘర్షణలు కొనసాగుతున్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ తన వేగాన్ని కొనసాగిస్తోందని చెప్పారు. ఇటీవల ముగిసిన త్రైమాసికంలో భారత్ 7.8 శాతం ఆర్థిక వృద్ధిని నమోదు చేసిందని వెల్లడించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న సమయంలో భారత్ వృద్ధి కొనసాగడం సానుకూల పరిణామమని పేర్కొన్నారు. దేశ ఆర్థిక ప్రగతి ఇప్పుడు ప్రపంచానికి విశ్వాసాన్ని కలిగించడంతో పాటు కొత్త అవకాశాలకు దారితీస్తోందని మోదీ అన్నారు.

**'ఘర్షణలకు చర్చలు, దౌత్యమే మార్గం'**

ఇక ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న యుద్ధాలు, ఉద్రిక్తతలపైనా ఇరువురు నేతలు చర్చించారు. ఉక్రెయిన్, పశ్చిమాసియా ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులపై భారత్ వైఖరిని మోదీ మరోసారి స్పష్టం చేశారు. అంతర్జాతీయ వివాదాలకు చర్చలు, దౌత్యం, న్యాయపాలన ఆధారంగా పరిష్కారం కనుగొనాల్సిన అవసరం ఉందన్నారు. ఉక్రెయిన్ లేదా పశ్చిమాసియా అయినా ఘర్షణలు త్వరగా ముగిసి శాంతి నెలకొనేందుకు చేపట్టే ప్రయత్నాలకు భారత్?, బెల్జియం మద్దతు ఇస్తాయని తెలిపారు. ఉగ్రవాదంపై కూడా ఇరుదేశాలు ఒకే వైఖరిని కలిగి ఉన్నాయని మోదీ చెప్పర్శు. ఉగ్రవాదాన్ని ఏ రూపంలో ఉన్నా నిర్మూలించేందుకు కలిసి పనిచేయడం రెండు దేశాల ఉమ్మడి బాధ్యతగా పేర్కొన్నారు.

**క్లీన్ ఎనర్జీ, కీలక ఖనిజాలపై దృష్టి**

భారత్?, బెల్జియం మధఅయ భవిష్యత్ సహకారంలో క్లీన్ ఎనర్జీ, సురక్షితమైన సరఫరా వ్యవస్థలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. పునరుత్పాదక ఇంధన రంగానికి సంబంధించి ఇరుదేశాల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఇది సుస్థిర ఇంధన రంగంలో ద్వైపాక్షిక భాగస్వామ్యానికి మరింత ఊతమిస్తుందని మోదీ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా కీలక ఖనిజాలకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ఈ రంగంపైనా ఇరుదేశాలు దృష్టి సారించాయి. ఖనిజాల ప్రాసెసింగ్, రీసైక్లింగ్‌లో సహకారాన్ని పెంచుకోవాలని నిర్ణయించినట్లు ప్రధాని తెలిపారు. సరఫరా వ్యవస్థలను బలోపేతం చేసేందుకు ఈ భాగస్వామ్యం ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.

**సెమీకండక్టర్లలో పరస్పర ప్రయోజనం**

అధునాతన సాంకేతిక రంగంలోనూ భారత్, బెల్జియం మధ్య సహకారానికి విస్తృత అవకాశాలున్నాయని ప్రధాని మోదీ చెప్పారు. ముఖ్యంగా సెమీకండక్టర్ రంగంలో బెల్జియం సాంకేతిక నైపుణ్యం, భారత్ వద్ద ఉన్న విస్తృత స్థాయి ఉత్పత్తి సామర్థ్యం ఒకదానికొకటి అనుకూలంగా ఉంటాయని పేర్కొన్నారు. రక్షణ రంగంలోనూ భాగస్వామ్యాన్ని పెంచుకునేందుకు ఇరుదేశాలు ఆసక్తి చూపాయి. ఆధునిక రక్షణ సాంకేతికత పరికరాల తయారీ, పరిశ్రమల మధ్య భాగస్వామ్యానికి అవకాశాలను అన్వేషించున్నాయి.


# అధిష్ఠానం నిర్ణయమే అంతిమం

మొదటి పేజీరువాయి

రాజగోపాల్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. "కొండా సురేఖకు సంబంధించిన పూర్తి నివేదిక హైకమాండ్ వద్ద ఉంది. పార్టీ తీసుకునే నిర్ణయానికి ఆమె కట్టుబడి ఉండాలి" అని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణలో మంత్రివర్గ విస్తరణ, పునర్వ్యవస్థీకరణ వంటి అంశాలను కాంగ్రెస్ అధిష్ఠానమే పర్యవేక్షిస్తుందని తెలిపారు.గత పదేళ్లుగా బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా పోరాడిన కాంగ్రెస్ కార్యకర్తలకు న్యాయం చేయడమే తన ప్రధాన కర్తవ్యమని రాజగోపాల్ రెడ్డి ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. తన పూర్తి దృష్టి కార్యకర్తల సంక్షేమంపైనే ఉందని పేర్కొన్నారు. మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గవర్నర్‌కు లేఖ రాశారన్న వార్తల నేపథ్యంలో ఈ రాజకీయ పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# 2027 వరకు ఎల్‌నినో..

మొదటి పేజీరువాయి




నివేదికలో డబ్ల్యూఎంఓ ఇంతటి అధిక స్థాయి విశ్వాసంతో ఎల్‌నినో కొనసాగింపుపై అంచనా వేయడం ఇదే తొలిసారి. పసిఫిక్ సముద్ర ఉపరితలంతో పాటు లోతైన జలాల్లోనూ అసాధారణంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇవి ఎల్‌నినో మరింత బలపడేందుకు అనుకూల పరిస్థితులను సృష్టిస్తున్నాయి.

**పసిఫిక్‌లో అసాధారణ వేడి**

ఎల్‌నినో అనేది మధ్య, తూర్పు ఉష్ణమండల పసిఫిక్ ప్రాంతంలో సముద్ర జలాలు సాధారణం కంటే ఎక్కువగా వేడెక్కే సహజ వాతావరణ ప్రక్రియ. దీని ప్రభావం పసిఫిక్ ప్రాంతానికే పరిమితం కాదు. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో వర్షపాతం, ఉష్ణోగ్రతల తీరును మార్చగలదు.ఎల్‌నినోను పర్యవేక్షించే కీలక ప్రాంతమైన నినో 3.4లో మే నుంచి జులై 2026 వరకు సముద్ర ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 1.5 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా ఉన్నాయి. జులైలో ఈ తేడా 2 డిగ్రీలకు చేరింది. జులై చివరి నుంచి ఆగస్టు మధ్య వరకు వారపు ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2.2 నుంచి 2.6 డిగ్రీల వరకు ఎక్కువగా నమోదయ్యాయి.సముద్రం అడుగుభాగంలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. జులై, ఆగస్టు ప్రారంభంలో కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే 8 డిగ్రీల సెల్సియస్ వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో 2026 చివరి నాటికి ఎల్‌నినో చాలా బలమైన స్థాయికి చేరుకోవచ్చని డబ్ల్యూఎంఓ అంచనా వేస్తోంది.

**భారత్‌పై ఎలాంటి ప్రభావం?**

ఎల్‌నినో ప్రభావం అన్ని దేశాల్లో ఒకేలా ఉండదు. అయితే భారత్‌కు ఇది కీలకమైన వాతావరణ సంకేతం. సాధారణంగా ఎల్‌నినో బలపడిన సంవత్సరాల్లో నైరుతి రుతుపవనాలు బలహీనపడే అవకాశం ఉంటుంది. ఫలితంగా వర్షపాతం తగ్గే పరిస్థితులు ఏర్పడొచ్చు.భారత్‌లో 2026 నైరుతి రుతుపవనాలపై భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఇప్పటికే ఆందోళనకర అంచనా ఇచ్చింది. మేలో విడుదల చేసిన అంచనాలో సీజన్ మొత్తం వర్షపాతం దీర్ఘకాల సగటులో 90 శాతంగా ఉండొచ్చని పేర్కొంది. లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం 60 శాతంగా అంచనా వేసింది.ఆ అంచనాలకు అనుగుణంగానే ఆగస్టు ముగిసే నాటికి దేశంలో వర్షపాతం 16 శాతం లోటుగా నమోదైంది.

# చిన్ని కృష్ణయ్యల సందడి..గోపికల కొలువులు!

## త్రివేణి టాలెంట్ స్కూల్‌లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 03,(హైదరాబాద్ పల్స్ న్యూస్):** రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని త్రివేణి టాలెంట్ స్కూల్ లింగంపల్లి శాఖలో కృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారులు, గోపికల వేషధారణలో బాలికలు విశేషంగా సందడి చేశారు. చిన్నారుల ముద్దుముద్దు వేషధారణలు, ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

**కృష్ణుడి వేషధారణలో చిన్నారుల సందడి**

కృష్ణాష్టమిని పురస్కరించుకుని పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. బాలురు నెమలిపించం, వేణువు ధరించి శ్రీకృష్ణుడి రూపంలో ముస్తాబై ఆకట్టుకోగా.. బాలికలు గోపికల వేషధారణలో సంప్రదాయ దుస్తులతో అలరించారు. చిన్నారుల వేషధారణలు, హావభావాలు, ఆటపాటలు వేడుకలకు ప్రత్యేక శోభను తీసుకొచ్చాయి.

**ఆటపాటలతో అలరించిన విద్యార్థులు**



శ్రీకృష్ణుడి బాల్య లీలలు, గోపికలతో కృష్ణుడి అనుబంధాన్ని ప్రతిబింబించేలా విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొనడంతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. విద్యార్థుల ప్రతిభను చూసి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మురిసిపోతూ అభినందించారు.

**సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన**

విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల ప్రాధాన్యతపై అవగాహన కల్పించేందుకే



పాఠశాలలో ఈ వేడుకలను నిర్వహించినట్లు యాజమాన్యం తెలిపింది. చదువుతో పాటు విద్యార్థుల్లో సృజనాత్మకత, సాంస్కృతిక విలువలను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అంగన్వాడీ టీచర్లపై అధికారుల ఒత్తిడి తొలగించాలి

## పెండింగ్‌లో ఉన్న బిఎల్ఓ పారితోషికాన్ని వెంటనే చెల్లించాలి: చిరంజీవి

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 03,(హైదరాబాద్ పల్స్ న్యూస్):** అంగన్వాడీ టీచర్లకు కేటాయించిన బి ఎల్ ఓ విధుల విషయంలో అధికారుల ఒత్తిడిని వెంటనే తొలగించాలని, పెండింగ్‌లో ఉన్న బి ఎల్ ఓ పారితోషికాన్ని తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ట్రేడ్ యూనియన్ కోఆర్డినేషన్ సెంటర్ (టీయూసీసీ) ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీయూసీసీ నాయకులు చిరంజీవి మాట్లాడుతూ.. అంగన్వాడీ టీచర్లు తమ రెగ్యులర్ విధులతో పాటు బి ఎల్ ఓ బాధ్యతలను కూడా సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని, అయినప్పటికీ వారికి రావాల్సిన పారితోషికం ఇంకా పెండింగ్‌లోనే ఉంచడం విచారకరమన్నారు. విధులు నిర్వహించే టీచర్లపై అనవసర ఒత్తిడి తేకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే గ్రామాల్లో బి ఎల్ ఓలు పనిచేసే సమయంలో ప్రజలు సహకరించేలా అధికారులు అవగాహన కల్పించాలని, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ట్రైనీ కలెక్టర్ ప్రతిభ శేఖర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో బి ఎల్ ఓలకు ఎవరైనా ఇబ్బందులు కలిగిస్తే వారిపై చట్టపరమైన, శాఖాపరమైన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అంగన్వాడీ టీచర్ల న్యాయమైన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన



పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్ ఆర్ ఓ విద్యాసాగర్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ అధికారులు గోపాల్, కాజా, శంకర్ రెడ్డిలతో పాటు బి ఎల్ ఓ విధుల్లో ఉన్న అంగన్వాడీ టీచర్లు వినకుమారి, పూలమ్మ, లక్ష్మి, లలిత, శశికళ, శోభ, సునీత, శైలజ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ 1000 రోజుల పాలనలో రైతాంగానికి అన్యాయం

## యూరియా కోసం రోజుల తరబడి క్యూలలో నిలబడే పరిస్థితి.. రైతు సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 03 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలో రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి ఆరోపించారు. రైతు సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించడంతో పాటు యూరియా కొరతను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన ఏడు రోజుల నిరసన కార్యక్రమాల్లో



భాగంగా నిజాంపేట్ మండల కేంద్రంలో మహారెడ్డి భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో రైతు సదస్సు, వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ రంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్, సాగునీటి ప్రాజెక్టులు వంటి కార్యక్రమాల ద్వారా రైతులకు భరోసా కల్పించామని భూపాల్ రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుబంధు సకాలంలో అందకపోవడం, రైతుబీమా అమలులో నిర్లక్ష్యం, సాగునీటి ప్రాజెక్టులపై శ్రద్ధ లేకపోవడం, ఎరువుల కొరత వంటి సమస్యలు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆరోపించారు. ప్రస్తుతం యూరియా కోసం రైతులు మండల కేంద్రాలు, సహకార సంఘాలు, ఎరువుల దుకాణాల వద్ద గంటల తరబడి క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. "షాపుల్లో లేని యూరియా.. యాపుల్లో ఉంటుందా?" అంటూ ప్రభుత్వ తీరుపై ప్రశ్నించారు. రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నప్పటికీ స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం బాధాకరమని భూపాల్ రెడ్డి అన్నారు. రైతుల సమస్యలను అసెంబ్లీ, పార్లమెంట్‌లో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. యూరియా కొరతను తక్షణమే నివారించి, రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్



చేశారు. సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యాన్ని వీడాలని, రైతుబీమాను సమర్థంగా అమలు చేయాలని, రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని భూపాల్ రెడ్డి తెలిపారు. రైతుల హక్కుల కోసం అవసరమైన పోరాటాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శిరీషను హత్య చేసిన హంతకున్ని చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలి

## ఆర్.సీత, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** హైదరాబాద్ లోని తుక్కుగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రేమ్ కేర్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలానికి చెందిన నిరుపేద శిరీషను దారుణంగా హత్య, అత్యాచారం చేయడాన్ని ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) తీవ్రంగా ఖండిస్తుంది. ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, ప్రగతిశీల శక్తులు, మహిళలు అందరూ ఖండించాలని పీఓడబ్ల్యూ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షురాలు ఆర్.సీత విజ్ఞప్తి చేశారు. శిరీషను హత్య చేసిన హంతకున్ని చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని ఇలాంటి దుర్మార్గాలు పునరావృతం కాకుండా తగిన గట్టి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆలేరు మండలం మందనపల్లిలో శిరీష హత్యను ఖండిస్తూ ప్రగతిశీల మహిళా సంఘం పిఓడబ్ల్యూ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతూ కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీత మాట్లాడుతూ... మనుషులలో ముఖ్యంగా యువత, విద్యార్థులలో మానసిక పరివర్తన లో మార్పు అనేది చాలా ముఖ్యమని, అందుకు ప్రస్తుత వ్యవస్థలో పాదుకుపోయిన అసభ్యత, అశ్లీలత, మహిళలను,




విద్యార్థినీలను, అమ్మాయిలను గౌరవించలేని సంస్కృతిని రూపుమాపాల్సిన అవసరం ఉందని అన్నారు. సమాజానికి అందిస్తున్న పాఠ్యాంశంలోని (సిలబస్) బోధనలు మారాలని, శాస్త్రీయత లేని, ఎదుటి వారిని గౌరవించలేని విష సంస్కృతి యువతను ఇలాంటి అరాచకాలకు పురిగొల్పుతోందని అన్నారు. మద్యం డ్రగ్స్ అశ్లీలత తదితర సాంఘిక దురాచారాలను నిషేధించడం మూలంగా యువతలో కొంతమేరకైనా మార్పును తీసుకురావడానికి దోహదపడుతుందని అందుకు పాలకులు ఈ దిశగా దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ఈ సందర్భంగా గంగసాని సరోజిని ఏలియాస్ సీతక్క సిపిఐ ఎం.ఎల్ న్యూ డెమోక్రసీ అజ్ఞాత దళ నాయకురాలు, ప్రగతిశీల మహిళా సంఘం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షురాలు, గౌరవ అధ్యక్షురాలుగా పనిచేసిన సీతక్కకు ఘనంగా విప్లవ జోహార్లు తెలిపారు. ఈ కార్యక్రమములో పీఓడబ్ల్యూ జిల్లా నాయకురాలు మరియు మదనపల్లి గ్రామ ఉపసర్పంచ్ పద్మ శశిరేఖ, పిఓడబ్ల్యూ జిల్లా సహాయ కార్యదర్శి తమ్మడి మాధవి, పీఓడబ్ల్యూ ప్రతినిధులు తమ్మడి ఉమా, కడకంచి పద్మ, కడకంచి అనిత, దార సుగుణ, బేతి లక్ష్మి, దొప్ప ప్రమీల, పద్మ సుస్మిత, మారేబోయిన శ్రీలత, పంగ అండాలు, దొంకెన లక్ష్మీనర్సమ్మ, సత్తెమ్మ, అండాలు తదితరులు పాల్గొన్నారు.




# బొమ్మలరామారం మండలానికి సాగు నీరు అందించాలని రైతుల పాదయాత్ర

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, బొమ్మలరామారం మండలానికి కొండపోచమ్మ సాగర్ ద్వారా కాళేశ్వరం జలాలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం భారీ పాదయాత్ర నిర్వహించారు. గత మూడు సంవత్సరాలుగా బొమ్మలరామారం మండలానికి కాళేశ్వరం జలాలు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, ఖాజీపేట గ్రామంలోని శామీర్‌పేట వాగు బ్రిడ్జి వద్ద నుంచి తిమ్మాపూర్ గ్రామంలోని గూడెం చెరువు వరకు సుమారు 500 మంది రైతులతో ఈ పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్రలో మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీమతి గొంగిడి సునిత మహేందర్ రెడ్డి పాల్గొని రైతులకు సంఘీభావం తెలిపారు. బొమ్మలరామారం మండల రైతులకు సాగునీరు అందే వరకు బీఆర్ఎస్ పార్టీ తరఫున పోరాటం కొనసాగిస్తామని ఆమె అన్నారు.



# సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం: అనిల్ రెడ్డి

**వర్గల్, సెప్టెంబర్ 03 ( హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలుస్తోందని సిద్దిపేట జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అనిల్ రెడ్డి అన్నారు. వర్గల్ మండలంలోని మాదారం గ్రామానికి చెందిన ఎల్క మల్లేశం అనారోగ్యంతో చికిత్స పొందగా, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 60 వేల చెక్కును అనిల్ రెడ్డి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికే పెద్దపీట వేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. రైతులు, విద్యార్థులు, పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వర్గల్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మట్ట సాయికుమార్, కాంగ్రెస్ నాయకులు నందకుమార్, రాజు, నితిన్ రెడ్డి, నర్సింలు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పంచముఖ సంకటహర మహా గణపతి రూపంలో ఖైరతాబాద్ గణేష్

## సుందరంగా ముస్తాబు అవుతున్న బడా గణేష్

**సెప్టెంబర్ 03, ఖైరతాబాద్(హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** 2026 ఏడాదికి గాను ఖైరతాబాద్ మహాగణపతి 69 అడుగుల ఎత్తులో 'పంచముఖ సంకటహర మహా గణపతి' రూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నాడు. సుమారు 69 అడుగుల ఎత్తులో గణపతి నిర్మాణం జరుగుతుంది. విగ్రహానికి ఒక వైపు 15 అడుగుల సోమనాథ్ జ్యోతిర్లింగం, మరోవైపు కాళికామాత ప్రతిమలను



ఏర్పాటు చేస్తున్నారు. ఈ సంవత్సరంతో ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలకు 72వ సంవత్సరం కావస్తుంది 1954 నుండి వరకు 2026 వరకు ఉత్సవాలను నిర్వహిస్తు వస్తున్నారు. ఈ సంవత్సరం పర్యావరణానికి హాని కలగని విధంగా ఎకో-ఫ్రెండ్లీ (మట్టి మరియు సహజ సిద్ధమైన రంగులు) విధానంలో ఈ నిర్మాణం జరుగుతోంది. దేశవ్యాప్తంగా విశేష గుర్తింపు కలిగిన హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ గణేశుడు. ఈ ఏడాది వినాయక చవితికి పంచముఖ సంకటహర మహా గణపతిగా దర్శనమివ్వనున్నారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ మహా గణపతి ఏర్పాట్లపై నిర్వహకులు హైదరాబాద్ పల్స్ న్యూస్ ప్రతినిధితో మాట్లాడారు.

# మహిళా సాధికారతే లక్ష్యం

## హుగ్గెల్లీలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

**జహీరాబాద్, సెప్టెంబర్ 03 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** గ్రామీణ మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలనే లక్ష్యంతో హుగ్గెల్లీ గ్రామంలో ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివేకానంద ఇన్స్టిట్యూట్ ఆఫ్ నాలెడ్జ్ అండ్ సర్వీసెస్ ఆధ్వర్యంలో, కోల్ ఇండియా సంస్థ ఆర్థిక సహకారంతో మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.గ్రామ సర్పంచ్ పట్లోళ్ల విమల శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక చొరవతో, ఆమె విజ్ఞప్తి మేరకు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి మున్సిపల్ వైస్ చైర్మన్ కొత్తకాపు శిరీష సురేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా శిరీష సురేందర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ మహిళలు ఇంటి వద్ద నుంచే స్వయం ఉపాధి పొందేందుకు కుట్టు వంటి వృత్తి నైపుణ్య శిక్షణలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. సామాజిక బాధ్యతతో కోల్ ఇండియా సహకారంతో వివేకానంద ఇన్స్టిట్యూట్ ఉచిత శిక్షణ అందించడం అభినందనీయమని పేర్కొన్నారు.మొదటి విడతలో ఎంపికైన 30 మంది మహిళలకు 60 రోజుల పాటు నిపుణులచే ఉచితంగా కుట్టు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన ప్రతి ఒక్కరికీ ఉచితంగా కుట్టు మిషన్ అందించనున్నట్లు చెప్పారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సూచించారు.గ్రామంలో మహిళలకు ఉపయోగపడే కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడంలో చొరవ చూపిన సర్పంచ్ విమల శ్రీనివాస్ రెడ్డిని, సహకరించిన సంస్థ ప్రతినిధులను గ్రామస్థులు అభినందించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, యూత్



కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి, ఉప సర్పంచ్ కె. మహిపాల్, వార్డు సభ్యులు బాల్‌రాజ్, ఎం. రూత్, సీనియర్ నాయకుడు ప్రవీణ్ కుమార్, శిక్షణ నిర్వాహకులు, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హామీల అమలులో వైఫల్యం: ఎమ్మెల్యే జిఎంఆర్

- విద్యార్థులు, యువత కోసం బీఆర్ఎస్ పోరుబాట
- 100 రోజులన్నారు.. 1000 రోజులు గడిచినా హామీలు అమలు కాలేదు:
- అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగా రెడ్డి

**పటాన్చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 03 :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీల అమలులో దారుణంగా విఫలమైందని అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగా విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు చేపట్టిన "కాంగ్రెస్ పార్టీ 420 మోసాలపై బీఆర్ఎస్ పార్టీ పోరుబాట" కార్యక్రమంలో భాగంగా రెండో రోజు పటాన్‌చెరు పట్టణంలోని మైత్రి గ్రౌండ్స్‌లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డితో కలిసి కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు, యువతకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఫీజు




రీయింబర్స్‌మెంట్ బకాయిలు, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయడంతో పాటు జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్‌ను అమలు చేయాలని కోరారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు దాటినా ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్





తుమ్మల పాండురంగా రెడ్డి అన్నారు. ప్రజలు, విద్యార్థులు, యువత సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువత, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కుత్బుల్లాపూర్‌లో బీఆర్ఎస్ భారీ ధర్నా

## 420 హామీల అమలులో కాంగ్రెస్ విఫలం: వీరారెడ్డి నరేందర్ రెడ్డి

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 03 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్‌లో భారీ ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ ఎంఆర్ఓ కార్యాలయం ఎదుట ఈ నిరసన చేపట్టారు.ధర్నా అనంతరం ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంఆర్ఓ అధికారికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జీడిమెట్ల 132వ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వీరారెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొని ప్రభుత్వ తీరుపై విమర్శలు చేశారు.ఈ సందర్భంగా వీరారెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల




సమయంలో ప్రజలకు ఇచ్చిన 420 హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుండా మోసం చేస్తోందని ఆరోపించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన పేదలకు వెంటనే ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అర్హులైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, 22-ఏ భూముల సమస్యను తక్షణమే పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ చేస్తున్న పోరాటం కొనసాగుతుందని ఆయన తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే ప్రజల తరఫున మరింత ఉధృతంగా ఉద్యమాలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు పరిపాలనా సేవలు మరింత చేరువ-రామగుండంఎమ్మెల్యే

## నూతన ఎమ్మార్వో కార్యాలయం ప్రారంభించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

**సెప్టెంబర్ 03, పెద్దపల్లి,(హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** పాలకుర్తి అభివృద్ధికి మరిన్ని అడుగులు.. త్వరలో ఎంపీడీఓ కార్యాలయం, 2 కోట్లతో మహిళా భవన్ నిర్మాణం. రామగుండం నియోజకవర్గం వేగంగా అభివృద్ధి చెందుతోందని, పాలకుర్తి మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి పారిశ్రామిక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ అన్నారు. గురువారం రోజు పాలకుర్తి మండలంలో తహసీల్దార్, సంయుక్త సబ్ రిజిస్ట్రార్, ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు. నూతన కార్యాలయం అందుబాటులోకి రావడం ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా, వేగంగా అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ రామగుండం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం, అధికారుల సమన్వయంతో నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు. పాలకుర్తి మండల ప్రజలకు పరిపాలనా సేవలు మరింత చేరువ చేసేందుకు త్వరలోనే ఎంపీడీఓ కార్యాలయం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.అలాగే పాలకుర్తి మండలంలో మహిళల కోసం రూ.2 కోట్లతో మహిళా భవన్ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మహిళల సంక్షేమం, సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, మహిళలకు అవసరమైన వసతులు కల్పించేందుకు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నామని చెప్పారు.పాలకుర్తి మండలాన్ని భవిష్యత్తులో పారిశ్రామికంగా అభివృద్ధి చేసి,స్థానికంగా ఉపాధి అవకాశాలు పెంచేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ హామీ ఇచ్చారు.మౌలిక వసతులు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాల ద్వారా మండల అభివృద్ధికి మరింత ఊతం ఇస్తామని అన్నారు.అనంతరం తెలంగాణ ప్రభుత్వం జారీ చేస్తున్న నూతన డిజిటల్ రేషన్ కార్డులను మహిళలకు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పంపిణీ చేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏమార్వో ఎంపీడీఓ,





ఏసీపీ, సీఐ, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

## విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర కీలకం. ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి

**సిర్గాపూర్, సెప్టెంబర్ 03 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** సిర్గాపూర్ మండల కేంద్రంలో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయులు కేవలం పాఠాలు బోధించేవారు మాత్రమే కాకుండా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యతను నిర్వహిస్తున్నారని అన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు నైపుణ్యాలు, విలువలు, సరైన దిశానిర్దేశం అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.మండల స్థాయిలో విద్యా రంగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులను ఎమ్మెల్యే శాలువా, స్మారక చిహ్నం, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తింపు పొందిన వారు మరింత అంకితభావంతో పనిచేసి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు.విద్యార్థులకు ఉపాధ్యాయులు మంచి మార్గదర్శకులుగా, స్నేహితులుగా వ్యవహరిస్తూ వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని ఎమ్మెల్యే అన్నారు. విద్యా నాణ్యత పెంపొందించేందుకు తీసుకుంటున్న చర్యలు, భవిష్యత్ ప్రణాళికలపై కార్యక్రమంలో చర్చించారు.కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి, ఆత్మ కమిటీ చైర్మన్ వినోద్ పాటిల్, మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్, సిర్గాపూర్ సర్పంచ్ శ్రీనివాస్ రావు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# విజేత హైస్కూల్‌లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

## కృష్ణుడి జీవన విలువలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలి. ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి




**నారాయణఖేడ్, సెప్టెంబర్ 03 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** నారాయణఖేడ్ పట్టణంలోని విజేత హైస్కూల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎం. శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో సందడి చేశారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు, సంప్రదాయ వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ప్రిన్సిపాల్ ఎం. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీకృష్ణుడి జీవితం, బోధనలు విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ధర్మం, సత్యం, క్రమశిక్షణ, మంచితనం వంటి విలువలను జీవితంలో అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణ రైతాంగానికి నీళ్లు ఇవ్వరా?.. కాంగ్రెస్ ప్రభుత్వానికి కేటీఆర్ సూటి ప్రశ్న..



మిర్యాలగూడ: తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఫోన్ చేస్తే ఆటోలో యూరియా వచ్చేదని, కాంగ్రెస్ పాలనలో మాత్రం యూరియా కోసం రైతులు తమ చెప్పులను లైన్లలో పెట్టాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. నల్లగొండ జిల్లాకు దరిద్రాన్ని తెచ్చుకుని నెత్తిన పెట్టుకున్నామని.. రక్తం రుచి మరిగిన కాంగ్రెస్ రాక్షస పులిని తెచ్చుకున్నామంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. మిర్యాలగూడలో కేటీఆర్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రులపై తీవ్ర విమర్శలు గుప్పించారు.నాగార్జునసాగర్‌లో నీళ్లు ఉన్నప్పటికీ జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు శనిలా దాపురించారని కేటీఆర్ ధ్వజమెత్తారు. తెలంగాణ రైతుల కళ్లల్లో నీళ్లు తెప్పించిన 'నీళ్ల మంత్రి' ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాద ఘటనపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలనూ కేటీఆర్ ప్రస్తావించారు. సొరంగంలో 'వాటర్‌లో నీళ్లు కలిశాయి' అంటూ మంత్రి మాట్లాడారని.. అసలు ఆయన 'క్వార్టర్‌లో నీళ్లు కలిశాయో ఏమో' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. హుజూర్‌నగర్‌లో నీళ్ల కోసం రైతులు తమ బాధలు చెప్పుకుందామంటే వారిని గెదుముతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. మంత్రి కోమటిరెడ్డి వ్యవహారం కూడా అందుకు భిన్నంగా లేదని విమర్శించారు.

# డివిజన్ స్థాయి ముఖ్య నాయకుల సమావేశం

**సమావేశంలో పాల్గొన్న బీజేపీ కొంపల్లి డివిజన్ అధ్యక్షుడు పెద్దబుద్దుల సతీష్ సాగర్**




**కొంపల్లి, సెప్టెంబర్ 03 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో డివిజన్, డివిజన్ పైస్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు గిరివర్ధన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డా. ఎస్. మల్లారెడ్డి, పార్టీ ఇన్‌చార్జి సేవెల్ల మహేందర్, ఉపాధ్యక్షుడు ఆదిరెడ్డి రాజిరెడ్డితో కలిసి బీజేపీ కొంపల్లి డివిజన్ అధ్యక్షుడు పెద్దబుద్దుల సతీష్ సాగర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలో పార్టీ భవిష్యత్ కార్యాచరణపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంగా పేర్కొంటున్న 22ఏ అంశానికి వ్యతిరేకంగా ఇందిరాపార్క్‌లో నిర్వహించనున్న ధర్నా కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో పార్లమెంట్ పరిధిలోని రాష్ట్ర స్థాయి నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ రాష్ట్ర మహిళా మోర్చా నాయకురాలు సరితారావు, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కో-కన్వీనర్ శివాజీ రాజు, కొంపల్లి డివిజన్ నాయకులు అశోక్, శంకర్‌నాయక్, మధు, ప్రకాశ్‌రావు, మహేశ్వర్‌రెడ్డి, శేఖర్, అశ్విన్, శివుడు తదితరులు పాల్గొన్నారు.

# నేపాల్‌లో వరద బీభత్సం.. 1,222 మంది మృతి

**4 వేల మందికి పైగా గల్లంతు.. సహాయక చర్యలకు ఆటంకంగా బురద, శిథిలాలు**



**కాఠ్మాండు, సెప్టెంబర్ 03 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** భారీ వర్షాలు, వరదలు, బురద ప్రవాహాలతో నేపాల్‌లో తీవ్ర విషాదం నెలకొంది. వరదల కారణంగా మృతుల సంఖ్య 1,222కు చేరినట్లు అధికారులు వెల్లడించారు. విపత్తు సంభవించి వారం రోజులు గడిచినా 4 వేల మందికి పైగా గల్లంతైనట్లు సమాచారం. గల్లంతైన వారిలో 583 మంది విదేశీయులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను అధికారులు ముమ్మరం చేశారు. ఇప్పటివరకు సుమారు 12 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. బాధితులకు సహాయం అందించేందుకు 20 వేల మందికి పైగా సిబ్బంది సహాయక, రక్షణ చర్యల్లో పాల్గొంటున్నారు. అయితే పలు ప్రాంతాల్లో భారీగా బురద, మట్టి, శిథిలాలు పేరుకుపోవడంతో గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టడం సవాల్‌గా మారింది. వరదల ధాటికి రహదారులు, నివాస ప్రాంతాలు, మౌలిక వసతులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కొండ ప్రాంతాల్లో మట్టి, శిథిలాలు పెద్దఎత్తున పేరుకుపోవడంతో సహాయక బృందాలు ప్రభావిత ప్రాంతాలకు చేరుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. గల్లంతైన వారి ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. మరోవైపు టిబెట్‌లోని గిరాంగ్ కౌంటీపైనా వరదల ప్రభావం తీవ్రంగా పడింది. అక్కడ మృతుల సంఖ్య 21కి చేరినట్లు సమాచారం. మరో 541 మంది గల్లంతైనట్లు అధికారులు వెల్లడించారు. దీంతో నేపాల్‌తో పాటు టిబెట్‌లోనూ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. భారీ వర్షాలు, వరదలు, బురద ప్రవాహాలతో ప్రభావితమైన ప్రాంతాల్లో పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకురావడానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు. గల్లంతైన వారి సంఖ్య, సహాయక చర్యల పరిస్థితిని బట్టి మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.




# 6న విద్యా హక్కుపై అవగాహన సదస్సు

**సంగారెడ్డి జిల్లా కేంద్రంలో మానవ హక్కుల సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమం**

**సంస్థ చైర్మన్ నవోదయ సిద్ధార్థ హాజరు..**

**సదస్సును విజయవంతం చేయాలని పిలుపు**



**నారాయణఖేడ్, సెప్టెంబర్ 03 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** విద్యా వ్యవస్థలో జరుగుతున్న పరిణామాలు, విద్యా హక్కు చట్టంపై అవగాహన కల్పించేందుకు మానవ హక్కుల సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 6న సంగారెడ్డి జిల్లా కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు సంస్థ రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ దిగ్గే బాబు, ఉపాధ్యక్షుడు టి.కుమార్ తెలిపారు. సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్డులో జైత్ర ఆసుపత్రి పైన ఉన్న పూలే మార్ట్, మహిళా ప్రాంగణంలో సదస్సు నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలోని విద్యా వ్యవస్థ, విద్యా హక్కు చట్టం, విద్యార్థులు, ఉపాధ్యాయుల హక్కులు, విద్యారంగంలో ఎదురవుతున్న సమస్యలపై సదస్సులో చర్చించి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ నవోదయ సిద్ధార్థ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. సంస్థ సలహాదారులు, ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు వెంకట్ దాస్, వెంకట రమణ, మొయినుద్దీన్, రమేష్, మోహన్, విజయ్, అన్వర్ ఖాన్, స్వామిదాస్, హైకోర్టు న్యాయవాది పుట్ట పద్మారావుతో పాటు పలువురు విద్యావేత్తలు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. విద్యా హక్కులపై అవగాహన పెంపొందించేందుకు నిర్వహిస్తున్న ఈ సదస్సుకు సంస్థ బాధ్యులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర కార్యదర్శులు ఎన్.ఆనంద్, దత్తా రెడ్డి, డాక్టర్ బాబు రావు, డాక్టర్ డి.ఓంప్రకాష్, గాలి రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పాక్‌లో డమ్మీ ప్రధాని.. ఆర్మీ చీఫే సుప్రీం: సైన్యాన్ని ఉతికారేసిన మౌలానా!

**పాకిస్థాన్‌లో సైనిక ఆధిపత్యంపై ఫజ్లుర్ రెహమాన్ తీవ్ర విమర్శలు**

**ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు స్వతంత్ర అధికారాలు లేవని ఆరోపణ**

**ఇస్లామాబాద్, సెప్టెంబర్ 03, హైదరాబాద్ పల్స్ న్యూస్:** పాకిస్థాన్‌లో ప్రభుత్వంపై సైనిక నాయకత్వం ప్రభావం పెరుగుతోందంటూ జమియత్ ఉలేమా-ఎ-ఇస్లాం (ఎఫ్) అధినేత, సీనియర్ పార్లమెంటేరియన్ మౌలానా ఫజ్లుర్ రెహమాన్ తీవ్ర విమర్శలు చేశారు. ప్రతిపక్షాల సమావేశంలో ప్రసంగించిన ఆయన.. దేశంలోని కీలక నిర్ణయాలపై సైనిక నాయకత్వం అధిక ప్రభావం చూపుతోందని ఆరోపించారు. ప్రధాని షెహబాజ్ షరీఫ్ నేతృత్వంలోని ప్రభుత్వానికి స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం తగ్గిపోయిందని ఫజ్లుర్ రెహమాన్ పేర్కొన్నారు. సాయుధ దళాలకు సంబంధించిన పలు కీలక అధికారాలు సైనిక నాయకత్వం పరిధిలోకి వెళ్లాయని ఆరోపించారు. ప్రస్తుత ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్




అసిమ్ మునీర్ దేశ పరిపాలనలో విస్తృత ప్రభావం చూపుతున్నారని ఆయన అన్నారు. ప్రభుత్వ వ్యవహారాల్లో సైనిక జోక్యం పెరగడం ప్రజాస్వామ్య వ్యవస్థకు ఆందోళనకర పరిణామమని వ్యాఖ్యానించారు. గతంలో పాకిస్థాన్‌లో సైనిక పాలనకు వ్యతిరేకంగా తాను పోరాడిన విషయాన్ని ప్రస్తావించిన ఫజ్లుర్ రెహమాన్.. ప్రస్తుతం కూడా సైనిక ఆధిపత్యానికి వ్యతిరేకంగా రాజకీయ పోరాటం అవసరమని అభిప్రాయపడ్డారు. ప్రతిపక్ష పార్టీలను ఒకే వేదికపైకి తీసుకువచ్చేందుకు ఆయన ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. పాకిస్థాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ సహా వివిధ రాజకీయ వర్గాలను కలుపుకుని సైనిక నాయకత్వం ప్రభావానికి వ్యతిరేకంగా రాజకీయ కార్యాచరణ రూపొందించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ప్రసంగం ద్వారా వెల్లడైంది. అయితే ఫజ్లుర్ రెహమాన్ చేసిన ఆరోపణలపై పాకిస్థాన్ ప్రభుత్వం లేదా సైనిక నాయకత్వం నుంచి అధికారిక స్పందన వెలువడిందా అన్నది స్పష్టంగా తెలియలేదు.

# మైనర్ బాలికపై ఇద్దరు ఆటో డ్రైవర్ల లైంగిక దాడి

**బాలికను నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లినట్లు ఆరోపణలు..**

**ఇద్దరు ఆటో డ్రైవర్లు అహ్మద్, అస్లాం నిందితుల అరెస్ట్**

**హైదరాబాద్, సెప్టెంబర్ 03 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** పాతబస్తీ పరిధిలో 15 ఏళ్ల బాలికపై ఇద్దరు ఆటో డ్రైవర్లు లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు రావడం కలకలం రేపింది. ఘటనకు సంబంధించి చాంద్రాయణగుట్ట పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.

**పోలీసుల వివరాల ప్రకారం..**

బండ్లగూడ ప్రాంతానికి చెందిన 15 ఏళ్ల బాలిక బార్కస్‌లోని ఓ నివాసంలో సహాయకురాలిగా పనిచేస్తోంది. విధులకు వెళ్లేందుకు ఆటో ఎక్కిన బాలికను, ఆటో డ్రైవర్లు అహ్మద్, అస్లాం గమ్యస్థానానికి తీసుకెళ్లకుండా నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. అక్కడ బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఫిర్యాదు అందిందన్నారు. ఘటన అనంతరం బాలిక కుటుంబ సభ్యులకు విషయం తెలియజేయడంతో వారు చాంద్రాయణగుట్ట పోలీసులను ఆశ్రయించారు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో చట్టంతో పాటు సంబంధిత నిబంధనల కింద కేసు




నమోదు చేశారు. ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు అహ్మద్, అస్లాంను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు. మైనర్లపై నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ 1000 రోజుల పాలనలో రైతులకు తీరని అన్యాయం

**రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి**

**పెద్దపల్లి బీఆర్ఎస్ ఇంచార్జి దాసరి మనోహర్‌రెడ్డి**

**పెద్దపల్లి, సెప్టెంబర్ 03 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా రైతులకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా అన్నదాతలను ఇబ్బందులకు గురిచేస్తోందని బీఆర్ఎస్ పెద్దపల్లి నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనను నిరసిస్తూ బీఆర్ఎస్ చేపట్టిన ఆందోళనల్లో భాగంగా పెద్దపల్లి నియోజకవర్గంలోని పెద్దపల్లి, సుల్తానాబాద్, కాల్వ శ్రీరాంపూర్, ఓదెల, జూలపల్లి, ఎలిగేడు మండల కేంద్రాల్లో గురువారం రైతు సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మనోహర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రకటించిన వరంగల్ రైతు డిక్లరేషన్, 420 హామీలను రైతులు గుర్తు చేసుకోవాలని ఆయన సూచించారు. రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. భూమి ఉన్న రైతులతో పాటు కౌలు రైతులకు ఎకరాకు ఏడాదికి రూ.15 వేలు, భూమిలేని రైతు కూలీలకు రూ.12 వేలు ఇస్తామని ప్రకటించి మాట తప్పిందని విమర్శించారు. అన్ని పంటలను మెరుగైన మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చినా, రైతులకు మద్దతు ధర అందించడంలో, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. మూడు పంటలకు రైతుబంధు అందిస్తామని చెప్పిన కాంగ్రెస్ నాయకులు రైతు భరోసా విషయంలో అయోమయానికి గురిచేస్తున్నారని విమర్శించారు. పంట నష్టపోయిన రైతులకు తక్షణ పరిహారం అందేలా పటిష్టమైన పంటల బీమా పథకం తీసుకొస్తామని హామీ ఇచ్చినా, వడగండ్ల వాన, తుపాన్లతో నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సాయం సకాలంలో అందడం లేదని ఆరోపించారు. 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చి కనీసం 10 గంటల విద్యుత్ కూడా అందించలేని పరిస్థితి తీసుకొచ్చారని విమర్శించారు.

**సాగునీటి విషయంలో తెలంగాణకు ద్రోహం**

కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన సాగునీటి వ్యవస్థను కాపాడాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం దానిని నిర్వీర్యం చేసేలా వ్యవహరిస్తోందని మనోహర్‌రెడ్డి ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షపూరితంగా వ్యవహరిస్తూ, పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టును కూడా నిర్లక్ష్యం చేస్తోందని అన్నారు. కృష్ణా, గోదావరి జలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను కాపాడాలని, బనకచర్ల అంశంలో తెలంగాణ రైతుల ప్రయోజనాలను దెబ్బతీసే నిర్ణయాలు తీసుకోవద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**హామీలను అమలు చేయాలి**

మూసివేసిన చక్కెర కర్మాగారాలను తెరిపించడం, పసుపు బోర్డు ఏర్పాటు, నకిలీ విత్తనాలు, పురుగు మందులపై కఠిన చర్యలు, రైతు కమిషన్ ఏర్పాటు, కొత్త వ్యవసాయ విధానం, రైతు కూలీలకు రైతు బీమా వంటి హామీలను అమలు చేయాలని మనోహర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో రైతులపై



హామీల వర్షం కురిపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సమావేశాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, మాజీ ఎంపీపీలు నూనేటి సంపత్, స్రవంతి మోహన్‌రావు, మాజీ జెడ్పీటీసీలు రాములు, వంగల తిరుపతిరెడ్డి, కౌన్సిలర్ వెన్నం సుజాత రవీందర్, పార్టీ మండల అధ్యక్షులు మార్కు లక్ష్మణ్, రామ్‌రెడ్డి, ఐరెడ్డి వెంకటరెడ్డి, దేవయ్య, బోయిని రాయమల్లు, మల్లేశం, రాజకుమార్, గుణపతి తదితరులు, పలువురు సర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# లిటిల్ మైండ్స్ హైస్కూల్‌లో హరితహారం

**విద్యార్థుల్లో పర్యావరణ బాధ్యత పెంపొందించడమే లక్ష్యం**

**మొక్కలు నాటి.. వాటి సంరక్షణకు విద్యార్థుల ప్రతిజ్ఞ**

**హైదరాబాద్ పల్స్, సెప్టెంబర్ 03, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి :**
డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామంలోని లిటిల్ మైండ్స్ హైస్కూల్‌లో గురువారం హరితహారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటారు. కేవలం మొక్కలు నాటడంతో కార్యక్రమాన్ని ముగించకుండా.. వాటి సంరక్షణ బాధ్యతను కూడా విద్యార్థులకు అప్పగిస్తూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ప్రకృతిని కాపాడటమే భవిష్యత్ తరాలకు ఇచ్చే గొప్ప బహుమతి అనే సందేశాన్ని విద్యార్థుల్లోకి తీసుకెళ్లారు. పెరుగుతున్న కాలుష్యం, తగ్గుతున్న పచ్చదనం, మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో మొక్కల పెంపకం ఆవశ్యకతను వారికి వివరించారు. ప్రతి ఇంటి వద్ద,




పాఠశాల పరిసరాల్లో, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని తెలిపారు. చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో ప్రకృతి పట్ల ప్రేమ, బాధ్యతను పెంపొందిస్తే వారు భవిష్యత్‌లో పర్యావరణ పరిరక్షణకు చురుకైన భాగస్వాములుగా మారుతారని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. నాటిన ప్రతి మొక్కను ఒక బాధ్యతగా భావించి క్రమం తప్పకుండా నీరు పోయడం, సంరక్షించడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ గోగుల మహేశ్వరి, ప్రిన్సిపాల్ గోగుల మాల్సూర్, ఇన్‌చార్జ్ ఆర్. భవాని శాంతి పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. ఉపాధ్యాయులు స్వరూప, ఉమా, శ్రీలత, షైనాజ్, కావ్య, సుభద్ర విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పచ్చదనం పెంపొందించడంతో పాటు నాటిన మొక్కలను నిరంతరం సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# కొండా సురేఖ స్థానంలో ఎవరు? మంత్రి పదవికి ఆరుగురు నేతల పేర్లు ప్రచారంలో.!

**హైదరాబాద్, సెప్టెంబర్ 03 ( హైదరాబాద్ పల్స్ న్యూస్):**
మంత్రి కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించిన నేపథ్యంలో ఖాళీ అయిన మంత్రి పదవిని ఎవరితో భర్తీ చేస్తారన్న అంశంపై కాంగ్రెస్ పార్టీలో ఆసక్తికర చర్చ సాగుతోంది. పలువురు సీనియర్ నేతల పేర్లు పరిశీలనలో ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మంత్రి పదవి కోసం ప్రధానంగా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఆది శ్రీనివాస్, మల్‌రెడ్డి రంగారెడ్డి, గడ్డం ప్రసాద్, ప్రేమ్‌సాగర్‌రావు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ పేర్లు వినిపిస్తున్నాయి. ఆయా నేతల రాజకీయ అనుభవం, పార్టీకి చేసిన సేవలు, ప్రాంతీయ ప్రాతినిధ్యం, సామాజిక సమీకరణలు వంటి అంశాలను కాంగ్రెస్ అధిష్ఠానం పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈసారి మంత్రివర్గ నియామకంలో సామాజిక సమతుల్యతకు అధిక ప్రాధాన్యం ఇవ్వొచ్చన్న అభిప్రాయం



వ్యక్తమవుతోంది. కొండా సురేఖ స్థానంలో మళ్లీ బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకుడికే అవకాశం కల్పించాలనే ఆలోచనపై కూడా పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరోవైపు మంత్రి పదవిని ఆశించిన నేతలు ఇప్పటికే ఏఐసీసీ పెద్దలను సంప్రదించి తమ అభ్యర్థిత్వాన్ని వినిపించినట్లు తెలుస్తోంది. పార్టీ కోసం చేసిన సేవలు, తమ రాజకీయ బలం, ప్రజాదరణను అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. అయితే ప్రస్తుతం పలు పేర్లు ప్రచారంలో ఉన్నప్పటికీ, తుది నిర్ణయం కాంగ్రెస్ అధిష్ఠానమే తీసుకోనుంది. సామాజిక సమీకరణాలు, ప్రాంతీయ సమతుల్యత, పార్టీ అవసరాలు, భవిష్యత్ రాజకీయ వ్యూహాలను దృష్టిలో ఉంచుకుని కొత్త మంత్రిని ఎంపిక చేసే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. కొండా సురేఖ బర్తరఫ్‌తో ఏర్పడిన ఖాళీని ఎప్పుడు భర్తీ చేస్తారు? ఎవరికి మంత్రి పదవి దక్కుతుంది? బీసీ వర్గానికే అవకాశం కల్పిస్తారా? అనే అంశాలపై కాంగ్రెస్ శ్రేణులు, రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. అధిష్ఠానం అధికారిక ప్రకటనపై అందరి దృష్టి నెలకొంది.

# మంథని శివారులో గుడుంబా డంప్‌పై పోలీసుల దాడి

**సుమారు 2,000 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం**

**సెప్టెంబర్ 03, మంథని (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**
రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంథని పట్టణ శివారులో గల నిర్మానుష్య ప్రాంతంలో పెద్ద మొత్తంలో అక్రమంగా గుడుంబా తయారీకి ఉపయోగించే బెల్లం పానకాన్ని నిల్వ చేసినట్లు నమ్మదగిన సమాచారం అందడంతో, మంథని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బుద్దె స్వామి ఆధ్వర్యంలో మంథని పోలీసులు ఈరోజు దాడి నిర్వహించారు. ఈ దాడిలో ప్లాస్టిక్ క్యాన్లు, డ్రమ్ముల్లో నిల్వ చేసిన సుమారు 2,000 లీటర్ల బెల్లం పానకాన్ని పోలీసులు గుర్తించారు. అక్రమ మద్యం తయారీకి ఉపయోగించే ఈ పానకం ప్రజలకు అందుబాటులోకి వెళ్లకుండా, ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నిబంధనల ప్రకారం పంచుల సమక్షంలో స్వాధీనం చేసుకుని, అక్కడికక్కడే ధ్వంసం చేశారు. ఈ ఘటనపై పోలీసులు తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. గుడుంబాను డంప్ చేసిన లేదా అక్రమంగా తయారు చేసి నిల్వ, రవాణా, విక్రయాలకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించేందుకు చర్యలు చేపట్టారు. అక్రమంగా గుడుంబా తయారీ, నిల్వ, రవాణా లేదా విక్రయానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు. అక్రమంగా తయారు చేసే గుడుంబాను ఎట్టి పరిస్థితుల్లోనూ సేవించవద్దని పోలీసులు ప్రజలకు సూచించారు. గుడుంబా ఆరోగ్యానికి తీవ్ర హానికరమై, కొన్ని సందర్భాల్లో ప్రాణనష్టానికి కూడా దారితీసే ప్రమాదం ఉందని తెలిపారు. మంథని సర్కిల్, పోలీస్ స్టేషన్ పరిధిలో గుడుంబా తయారీ, నిల్వ లేదా విక్రయానికి సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిసినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని సీఐ తెలిపారు. ఈ దాడిలో హెడ్ కానిస్టేబుళ్లు కృష్ణ నాయక్, రమేష్ రావు, కానిస్టేబుళ్లు శివ, అజిత్, సతీష్, అంజి పాల్గొన్నారు.





## రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి
# ముగింపు పలకాలి: జైశంకర్

**మధ్యవర్తిత్వంతో సహా అవసరమైన సహాయానికి భారత్ సిద్ధం**

**సెంట్రల్ డెస్క్, సెప్టెంబర్ 03 (హైదరాబాద్ పల్స్ న్యూస్):**
రష్యా--ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలికేందుకు భారత్ తన వంతు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ తెలిపారు. శాంతి సాధన కోసం మధ్యవర్తిత్వంతో పాటు అవసరమైన ఇతర సహాయాన్ని అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లో ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆండ్రీ సిబిహా నేతృత్వంలో జరిగిన మీడియా సమావేశంలో జైశంకర్ మాట్లాడారు. యుద్ధ భూమిలో సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించదని, చర్చలు, దౌత్యపరమైన చర్యలు, మధ్యవర్తిత్వం ద్వారానే శాంతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. యుద్ధం కొనసాగుతున్న కొద్దీ ప్రాణనష్టం, విధ్వంసం పెరుగుతూనే ఉంటాయని జైశంకర్ అన్నారు. ఇటీవల కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలను ఆయన ప్రస్తావించారు. రష్యా--ఉక్రెయిన్ మధ్య యుద్ధానికి ముగింపు పలికి శాంతి నెలకొల్పాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రష్యా-ఉక్రెయిన్ ఘర్షణ ప్రభావం ప్రపంచ వాణిజ్యంపై కూడా పడుతోందని జైశంకర్ తెలిపారు. వాణిజ్య నౌకలపై జరుగుతున్న దాడుల కారణంగా భారతీయ నావికులు ప్రాణాలు కోల్పోవడం ఆందోళనకరమని అన్నారు. నౌకాయానంపై దాడుల ప్రభావంతో ప్రపంచ దక్షిణ దేశాల్లో చమురు, ఎరువులు, ఆహార సరఫరాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఉక్రెయిన్‌కు భారత్ మానవతా సహాయాన్ని అందిస్తోందని జైశంకర్ తెలిపారు. ఇప్పటివరకు 19 విడతల్లో మానవతా సహాయాన్ని పంపినట్లు



వివరించారు. భారత్--ఉక్రెయిన్ మధ్య ఔషధాలు, వ్యవసాయం, ఎరువులు, యంత్రాలు, రసాయనాలు, వినియోగ వస్తువుల వంటి పలు రంగాల్లో సంబంధాలు కొనసాగుతున్నాయని తెలిపారు. విదేశీ పర్యటనలో భాగంగా జైశంకర్ సెప్టెంబర్ 3 నుంచి 5 వరకు ఉక్రెయిన్, పోలాండ్‌లో పర్యటిస్తున్నారు.



# చైనా సంచలనం.. యుద్ధం వస్తే సాధారణ ప్రజలూ పోరాడాల్సిందే!

**ప్రైవేటు సంస్థల వనరులనూ రక్షణ అవసరాలకు వినియోగించేలా చైనా నిబంధనల్లో మార్పులు**

**బీజింగ్, సెప్టెంబర్ 03 (హైదరాబాద్ పల్స్ న్యూస్):**
యుద్ధం లేదా అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు దేశ రక్షణకు సాధారణ పౌరులు, ప్రైవేటు సంస్థలు కూడా మరింతగా భాగస్వాములు అయ్యేలా చైనా నిబంధనల్లో కీలక మార్పులు చేసినట్లు సమాచారం. అక్టోబర్ 1 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. కొత్త నిబంధనల ప్రకారం యుద్ధ సమయంలో ప్రైవేటు సంస్థలకు చెందిన ఆస్తులు, సాంకేతిక పరిజ్ఞానం సహా వివిధ వనరులను దేశ రక్షణ అవసరాలకు వినియోగించుకునే అవకాశం కల్పించినట్లు తెలుస్తోంది. దీంతో ప్రభుత్వ వనరులతో పాటు ప్రైవేటు రంగానికి చెందిన మౌలిక సదుపాయాలు, సాంకేతిక సామర్థ్యాలను కూడా అత్యవసర పరిస్థితుల్లో సమీకరించే విధంగా వ్యవస్థను రూపొందిస్తున్నట్లు సమాచారం. దేశ సార్వభౌమత్వం, భౌగోళిక సమగ్రత, భద్రత, జాతీయ ఐక్యతకు ముప్పు కలిగించే చర్యలతో పాటు దేశ అభివృద్ధికి ఆటంకం కలిగించే పరిస్థితులను కూడా జాతీయ భద్రతకు సంబంధించిన పరిధిలోకి తీసుకువచ్చేలా నిబంధనల్లో మార్పులు చేసినట్లు సమాచారం.

**ప్రైవేటు రంగంపై కూడా దృష్టి**
అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వం, పౌరులు, ప్రైవేటు సంస్థలు, సాంకేతిక రంగం సమన్వయంతో పనిచేసేలా వ్యవస్థను బలోపేతం చేయడమే ఈ మార్పుల ఉద్దేశంగా విశ్లేషణలు సాగుతున్నాయి. ముఖ్యంగా ప్రైవేటు రంగంలోని సాంకేతిక సామర్థ్యాలను రక్షణ అవసరాలకు వినియోగించుకునే అంశానికి ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. అక్టోబర్ 1 నుంచి ఈ మార్పులు అమల్లోకి వస్తే యుద్ధ సమయంలో పౌరుల బాధ్యతలు, ప్రైవేటు సంస్థల వనరుల వినియోగం, జాతీయ భద్రతకు సంబంధించిన నిబంధనల్లో మార్పులు చోటుచేసుకోనున్నాయి. చైనా తీసుకున్న ఈ నిర్ణయం అంతర్జాతీయంగా చర్చకు దారితీసే అవకాశం ఉంది.

# శ్రీకృష్ణ జన్మాష్టమి.. ధర్మం, ప్రేమ, మానవతకు సందేశం

**భగవద్గీత బోధనలు నేటి సమాజానికి మార్గదర్శకం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 03 (హైదరాబాద్ పల్స్ న్యూస్):**
భారతీయ ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమికి ప్రత్యేక స్థానం ఉంది. శ్రీమహావిష్ణువు అవతారంగా భావించే శ్రీకృష్ణుడి జన్మదినాన్ని దేశవ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. చెడుపై మంచి, అధర్మంపై ధర్మం, అహంకారంపై మానవత్వం సాధిస్తాయనే సందేశాన్ని ఈ పర్వదినం



అందిస్తుంది. ద్వాపర యుగంలో అధర్మం పెరిగిన సమయంలో శ్రీకృష్ణుడు అవతరించాడని పురాణాలు చెబుతున్నాయి. మథురలో వసుదేవుడు, దేవకీలకు జన్మించిన కృష్ణుడు గోకులంలో పెరిగి బాల్యదశ నుంచే తన లీలలతో ప్రజలను ఆకట్టుకున్నాడని భక్తి సాహిత్యం వివరిస్తుంది. కృష్ణుడి బాల్య ఘట్టాలు, గోపికలతో అనుబంధం, గోవర్ధనగిరి ఎత్తడం వంటి కథలు భారతీయ సంస్కృతిలో ప్రత్యేకంగా నిలిచాయి.

**భగవద్గీత.. జీవితానికి మార్గదర్శనం**
కురుక్షేత్ర యుద్ధభూమిలో అర్జునుడికి శ్రీకృష్ణుడు అందించిన బోధనలు భగవద్గీతగా ప్రసిద్ధి చెందాయి. కర్తవ్యాన్ని నిబద్ధతతో నిర్వర్తించడం, ఫలితాలపై అతిగా ఆశపడకుండా బాధ్యతను నిర్వహించడం, ధర్మాన్ని కాపాడటం, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగడం వంటి విలువలను గీతా బోధనలు వివరిస్తాయి. నేటి వేగవంతమైన జీవన విధానంలో ఒత్తిడి, పోటీ, అనిశ్చితి పెరుగుతున్న నేపథ్యంలో భగవద్గీతలోని ఆలోచనలు వ్యక్తిగత జీవితానికి కూడా మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. కష్టాలను ఎదుర్కొంటూ ధైర్యంగా ముందుకు సాగడం, సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించడం వంటి విలువలను కృష్ణుడి జీవితం నేర్పుతుంది.

**దేశవ్యాప్తంగా వైభవంగా వేడుకలు**
జన్మాష్టమి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజనలు, కీర్తనలు నిర్వహిస్తారు. అర్ధరాత్రి సమయంలో శ్రీకృష్ణుడి జన్మవేడుకను ప్రత్యేకంగా నిర్వహించడం అనేక ప్రాంతాల్లో ఆనవాయితీగా కొనసాగుతోంది. ఇళ్లలో చిన్నారులను కృష్ణుడు, రాధ వేషధారణలో అలంకరించడం, ఉట్టి కొట్టడం, దహిహండి వంటి కార్యక్రమాలు పండుగకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. పాఠశాలలు, విద్యాసంస్థల్లోనూ జన్మాష్టమి వేడుకలను నిర్వహిస్తూ విద్యార్థులకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పిస్తున్నారు. చిన్నారుల వేషధారణ, సాంస్కృతిక కార్యక్రమాలు, కృష్ణుడి జీవిత ఘట్టాల ప్రదర్శనలు పండుగకు మరింత శోభను తీసుకొస్తున్నాయి.

**సమాజానికి కృష్ణుడి సందేశం**
శ్రీకృష్ణుడి జీవితం కేవలం ఆధ్యాత్మిక విశ్వాసానికి మాత్రమే పరిమితం కాకుండా అనేక సామాజిక విలువలను కూడా ప్రతిబింబిస్తుంది. పరిస్థితులు ఎంత క్లిష్టంగా ఉన్నా ధర్మం వైపు నిలబడటం, అన్యాయాన్ని ప్రశ్నించడం, అవసరమైనప్పుడు సమాజ రక్షణకు ముందుకు రావడం వంటి సందేశాలను కృష్ణుడి జీవితం అందిస్తుంది. ప్రేమ, స్నేహం, ధర్మం, కర్తవ్యం, సమానత్వం, మానవత్వం వంటి విలువలను ఆచరణలో పెట్టడమే జన్మాష్టమి పర్వదినానికి నిజమైన అర్థమని పలువురు ఆధ్యాత్మికవేత్తలు పేర్కొంటున్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఆలయాలు, ఇళ్లు, విద్యాసంస్థలు భక్తి, సాంస్కతిక కార్యక్రమాలతో సందడిగా మారుతున్నాయి. కృష్ణుడి బోధనలను జీవితంలో ఆచరించాలనే సంకల్పంతో పర్వదినాన్ని జరుపుకోవడం ద్వారా సమాజంలో సానుకూలత, నైతిక విలువలు మరింత బలపడాలని ఆకాంక్షిద్దాం.ఝ

# ఆత్మ కమిటీ చైర్మన్, డైరెక్టర్లను ప్రమాణ స్వీకారం చేయించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య





**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని మున్నూరు కాపు సత్రంలో ఆత్మ కమిటీ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, బీర్ల ఫౌండేషన్ చైర్‌పర్సన్ శ్రీమతి బీర్ల అనిత ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన ఆత్మ కమిటీ చైర్మన్ ఏనగండ్ల సుధాకర్ మరియు డైరెక్టర్లను ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఘనంగా సన్మానించి, ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ…“వ్యవసాయ రంగం అభివృద్ధి, రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ సాగు విధానాలపై అవగాహన కల్పించడంతో పాటు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ఆత్మ కమిటీలు కీలకపాత్ర పోషించాలి. ఆలేరు నియోజకవర్గంలోని రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వ్యవసాయ శాఖ ద్వారా అందుతున్న సేవలు పూర్తిస్థాయిలో చేరేలా కమిటీ సభ్యులు కృషి చేయాలి. రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలి. చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎనగండ్ల సుధాకర్ తో పాటు నూతన డైరెక్టర్లందరికీ అభినందనలు. తమపై ప్రభుత్వం, రైతులు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అంకితభావంతో పనిచేయాలి. ఆలేరు నియోజకవర్గాన్ని వ్యవసాయ రంగంలో మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు అందరం సమన్వయంతో పనిచేద్దాం” అని అన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గ్రామస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేసి, అర్హులైన ప్రతి రైతుకు వాటి ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ నూతన చైర్మన్, డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతు ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాజపేట సబ్ స్టేషన్ వద్ద బీఆర్ఎస్ నిరసన



## రైతాంగానికి నాణ్యమైన కరెంటు ఇవ్వాలి

### బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, రాజపేట సబ్ స్టేషన్ వద్ద బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్ అధ్యక్షత నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్ మాట్లాడుతూ... కాంగ్రెస్ గవర్నమెంట్ మేనిఫెస్టోలో ఎన్నికల ముందు 100 రోజులలో ప్రజలకు ఇచ్చిన హామీలు ఆరు గ్యారంటీలు 420 హామీలు అమలు చేస్తానని చెప్పి ఇప్పటివరకు వెయ్యి రోజులు పరిపాలన జరిగిన ఒక్కటి కూడా అమలు జరగలేక ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పై బీఆర్ఎస్ ప్రజలకు మద్దతుగా ఎనిమిది రోజులు కార్యక్రమాలు చేయడం జరుగుతుంది ఇందులో భాగంగా గురువారం రోజు రైతాంగానికి నాణ్యమైన కరెంటు ఇవ్వడం లేదు 24 గంటలు కరెంటు ఇస్తామని చెప్పి కనీసం ఎనిమిది గంటలు కూడా కరెంటు ఇయ్యలేకపోతున్న కాంగ్రెస్ పార్టీ విధానాల పట్ల మోసపూరితమైన మాటలు ఎండగాడుతూ రాజపేట సబ్ స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరు రామచంద్రారెడ్డి, రాజపేట మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్, రాజపేట గ్రామ శాఖ అధ్యక్షులు బేడిద వీరేశం, జలసాధన సమితి అధ్యక్షులు ఎర్ర గోకుల జస్వంత్, సింగిల్ విండో మాజీ చైర్మన్ చింతలపూరి భాస్కర్ రెడ్డి, వైస్ చైర్మన్ కాకాల ఉపేందర్, మాజీ ఎంపీపీ బాలమణి, యాదగిరి గౌడ్, రఘునాథపురం సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్, కురారం సర్పంచ్ బొడ్డు భాస్కర్, మల్లగూడెం సర్పంచ్ జన్నేపల్లి బాలరాజు రెడ్డి, భోగ హరినాథ్, బొంగోని ఉప్పలయ్య, మాజీ సర్పంచ్ రామిళ్ళ నరేందర్, గోపిరెడ్డి, పంబ కర్ణాకర్, రాములు నాయక్, లక్ష్మణ్ నాయక్, ఎమ్మా భాస్కర్, అంబాభాయ్, బోనాల వెంకటయ్య, బిల్లకుదురు రాజు, మేక వెంకటేశ్వర్ రెడ్డి, గోపాల్ గౌడ్, కుమ్మరి పుల్లయ్య, ములుగు సోమలింగం, బాలకృష్ణ, సత్యనారాయణ రెడ్డి, రమేష్, శీను, చంద్రమౌళి, భూపతి కిషన్, రవి, బాల్రాజ్, అశోక్ రెడ్డి, నర్సింలు, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు

# వరదలతో విలవిల్లాడుతున్న నేపాల్‌కు భారత్ అండ.. ఎన్నో విధాలుగా సాయం!

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 03 (హైదరాబాద్ పల్స్ న్యూస్ ప్రతినిధి):**
ఆకస్మిక వరదలతో తీవ్రంగా నష్టపోయిన నేపాల్‌కు భారత్ అన్ని విధాలుగా చేయూతనందిస్తోంది. విపత్తు ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను వేగవంతం చేసేందుకు అత్యవసర సహాయ సామగ్రితో కూడిన ఐదు విమానాలను భారత్ పంపించినట్లు సమాచారం. వరదల్లో గాయపడిన వారికి వైద్య సేవలు అందించేందుకు భారత వైద్య బృందాలు, వైద్య సిబ్బంది, అవసరమైన మందులను నేపాల్‌కు తరలించారు. స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ బాధితులకు అత్యవసర వైద్య సేవలు అందిస్తున్నారు. విపత్తు ప్రభావంతో దెబ్బతిన్న రవాణా, సమాచార వ్యవస్థల పునరుద్ధరణలోనూ భారత్ సహకరిస్తోంది. అలాగే నష్టపోయిన పాఠశాలలను తిరిగి అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో సహాయపడుతోంది. విద్యార్థుల చదువులకు అంతరాయం కలగకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. నేపాల్‌లోని జలవిద్యుత్ ప్రాజెక్టుల సొరంగాల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు నిర్వహిస్తున్న రెస్క్యూ ఆపరేషన్లలో భారత సైనిక బృందాలు పాల్గొంటున్నాయి. క్లిష్ట పరిస్థితుల్లో సహాయక చర్యలకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, పరికరాలను అందిస్తున్నాయి. మరోవైపు వరదల్లో మృతిచెందిన వారి గుర్తింపులో భారత ఫోరెన్సిక్ నిపుణులు సహాయపడుతున్నారు. మృతదేహాల గుర్తింపు, కుటుంబ సభ్యులకు సమాచారాన్ని చేరవేయడంలో స్థానిక యంత్రాంగానికి తోడ్పాటునందిస్తున్నారు. ప్రకృతి విపత్తు సమయంలో పొరుగు దేశానికి అండగా నిలుస్తున్న భారత్, సహాయ సామగ్రి నుంచి వైద్య సేవలు, రక్షణ చర్యలు, మౌలిక సదుపాయాల పునరుద్ధరణ వరకు పలు రంగాల్లో సహకారం అందిస్తూ మానవతా దృక్పథాన్ని చాటుతోంది.



# 6 వేల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి డిమాండ్

## రెండో రోజు నిరసనలో మన్నే కృషాంక్

**లాల్‌బజార్, సెప్టెంబర్ 03 (హైదరాబాద్ పల్స్ న్యూస్):**
కంటోన్మెంట్ నియోజకవర్గంలో 6 వేల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసన కార్యక్రమం రెండో రోజూ కొనసాగింది. కంటోన్మెంట్ నియోజకవర్గం 7వ వార్డు మాజీ బోర్డు సభ్యుడు శ్యామ్ కుమార్ ఆధ్వర్యంలో 22ఏ నిషేధిత భూములకు సంబంధించిన అంశంపై నిరసన చేపట్టారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ మన్నే కృషాంక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మన్నే కృషాంక్ మాట్లాడుతూ కంటోన్మెంట్ నియోజకవర్గ ప్రజలకు 6 వేల ఇందిరమ్మ ఇళ్లను తక్షణమే నిర్మించాలని డిమాండ్ చేశారు. 22ఏ నిషేధిత భూములకు సంబంధించిన నిర్ణయాన్ని ప్రభుత్వం పునఃపరిశీలించాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో పథకాలను ప్రకటించి వాటి అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని




ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆయన విమర్శించారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకు బీఆర్ఎస్ ప్రజల తరఫున ప్రశ్నిస్తూనే ఉంటుందని తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీ గణేశ్ 6 వేల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి హామీ ఇచ్చారని, అయితే సంబంధిత భూముల విషయంలో జరుగుతున్న పరిణామాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కృషాంక్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములకు సంబంధించిన న్యాయపరమైన అంశాలపై ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని కోరారు. రైతులు, మహిళలు, యువత, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఆయన అన్నారు. సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన పేదలకు అందే వరకు ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. నిరసనలో గజ్జల నాగేష్, నివేదిత, జక్కుల మహేశ్వర్‌రెడ్డి, టి.ఎన్. శ్రీనివాస్, మాజీ బోర్డు సభ్యులు పాండు యాదవ్, లోకనాథ్, అనిత ప్రభాకర్, నళిని, శంకర్‌రావుతో పాటు బీఆర్ఎస్ నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.


# జర్మనీలో రికార్డు స్థాయిలో వేడి.. 16,300 మంది మృతి!

## యూరప్‌ను వణికిస్తున్న తీవ్ర వడగాలులు.. వృద్ధులే అధికంగా బలి

**సెంట్రల్ డెస్క్, సెప్టెంబర్ 03 (హైదరాబాద్ పల్స్ న్యూస్):**
యూరప్‌ను తీవ్ర వడగాలులు వణికిస్తున్నాయి. జర్మనీలో ఈ ఏడాది ఎండల తీవ్రత కారణంగా రికార్డు స్థాయిలో మరణాలు సంభవించినట్లు అధికారిక గణాంకాలు వెల్లడించాయి. జూన్ 1 నుంచి ఆగస్టు 23 వరకు ఉష్ణోగ్రతల కారణంగా సుమారు 16,300 మంది ప్రాణాలు కోల్పోయినట్లు జర్మనీ ప్రభుత్వానికి చెందిన రాబర్ట్ కోచ్ ఇన్‌స్టిట్యూట్ తాజా గణాంకాల్లో పేర్కొంది. వాతావరణ మార్పులు, కరవు పరిస్థితుల ప్రభావంతో యూరప్ వ్యాప్తంగా ఈ ఏడాది వరుసగా తీవ్ర వడగాలులు నమోదవుతున్నాయి. వీటి కారణంగా వివిధ దేశాల్లో 30 వేలకు పైగా మరణాలు సంభవించి ఉండవచ్చని శాస్త్రవేత్తలు, నిపుణులు అంచనా వేస్తున్నారు. రాబర్ట్ కోచ్ ఇన్‌స్టిట్యూట్ గత వారం వెల్లడించిన గణాంకాల్లో 15,800 ఉష్ణోగ్రత సంబంధిత మరణాలు నమోదుకాగా, తాజా లెక్కల్లో ఆ సంఖ్య 16,300కు చేరింది. ముఖ్యంగా 75 ఏళ్లు పైబడిన వృద్ధులు తీవ్ర వేడిగాలుల ప్రభావానికి ఎక్కువగా గురైనట్లు జర్మనీ ఆరోగ్య శాఖ తెలిపింది.

**ఒక్క వారంలోనే 9,600 మరణాలు**

జూన్ 22 నుంచి 28 వరకు ఒక్క వారంలోనే సుమారు 9,600 మంది ఉష్ణోగ్రతల కారణంగా ప్రాణాలు కోల్పోయినట్లు రాబర్ట్ కోచ్ ఇన్‌స్టిట్యూట్ అంచనా వేసింది. జర్మనీలో గత దశాబ్ద కాలంగా వేడి కారణంగా సంభవించే మరణాలపై ఇన్‌స్టిట్యూట్ గణాంకాలను సేకరిస్తోంది. ఇప్పటివరకు 2018లో నమోదైన 8,900 ఉష్ణోగ్రత సంబంధిత మరణాలే అత్యధికంగా ఉండగా, తాజా గణాంకాలు ఆ రికార్డును అధిగమించాయి.



1994లోనూ తీవ్ర వేడిగాలుల కారణంగా దాదాపు 10 వేల మంది మరణించినట్లు అప్పటి వైద్య సంబంధిత నివేదికలు అంచనా వేశాయి. ప్రస్తుత గణాంకాలు గత రికార్డులను అధిగమించడం యూరప్‌లో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వాతావరణ మార్పుల ప్రభావం తీవ్రతను సూచిస్తున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు.

# యాదగిరిగుట్టలో ఘనంగా 1000 రోజుల ప్రజా పాలన సంబరాలు

## ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుంది

### ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా, యాదగిరిగుట్ట తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా యాదగిరిగుట్ట పట్టణంలో ప్రజా పాలన 1000 రోజుల సంబరాలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. యాదాద్రి డీసీసీ అధ్యక్షులు, ఆలేరు ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య నాయకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మండల అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ... ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో ప్రజా ప్రభుత్వం గత 1000 రోజులుగా ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలిచేలా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతు రుణమాఫీ, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాల ద్వారా రాష్ట్రంలోని లక్షలాది కుటుంబాలకు ప్రత్యక్షంగా ప్రయోజనం అందుతోందని అన్నారు. ప్రజా సంక్షేమంతో పాటు మౌలిక వసతుల అభివృద్ధికి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని బీర్ల ఐలయ్య తెలిపారు. ఆలేరు నియోజకవర్గ అభివృద్ధి కోసం వేల కోట్ల రూపాయల నిధులను తీసుకువచ్చి రహదారులు, తాగునీరు, సాగునీరు, విద్య, వైద్యం తదితర రంగాల్లో అభివృద్ధి పనులను చేపడుతున్నామని చెప్పారు. ఆలేరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన ప్రతి అభివృద్ధి పనిని గుర్తించి, నిధులు సమకూర్చి, పనులను వేగంగా పూర్తి చేసే దిశగా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి ఇంటికీ చేరేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజలే ప్రజా ప్రభుత్వానికి అసలైన బ్రాండ్ అంబాసిడర్లని, ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలే ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకాన్ని మరింత పెంచుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# 'రోమాంచకం' మూవీ రివ్యూ



అగ్ర దర్శకులు తమ సొంత నిర్మాణ సంస్థలో సినిమాలు నిర్మించడం కొత్తేమీ కాదు. ఇప్పుడు ఆ వరుసలోనే పాన్ ఇండియా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తన బ్యానర్ భద్రకాళి సంస్థపై నిర్మించిన చిత్రం 'రోమాంచకం'. సుమంత్ ప్రభాస్, అనంతిక సనీల్ కుమార్ జోడీగా నటించిన ఈ సినిమాకు వేణుగోపాల్ రెడ్డి దర్శకుడు. ప్రచారం చిత్రాలతో, పబ్లిసిటీతో అలరించిన ఈ సినిమా యూత్‌లో మంచి బజ్‌ను తెచ్చుకుంది. ఇక ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం ఎలా ఉంది? 'రోమాంచకం' ఆడియన్స్‌ను ఎంటర్‌టైన్ చేసిందా? అనేది సమీక్షలో తెలుసుకుందాం.అన్వేష్ (సుమంత్ ప్రభాస్) ఫ్రెండ్స్‌తో కలిసి ఒక స్టార్టప్ కంపెనీని ప్రారంభించే ట్రయల్స్‌లో ఉంటాడు.ఇందులో భాగంగానే 'రోమాంచకం'పేరుతో డేటింగ్ యాప్‌ను డెవలప్ చేస్తుంటాడు. అమ్మాయిలు, అబ్బాయిల మధ్య రిలేషన్స్, ఒకరికొకరు సహకరించుకోవడం, ఒకరి అవసరాలు మరొకరు తీర్చడమే ఈ డేటింగ్ యాప్ లక్ష్యం అని చెప్పి ఇన్వెస్టర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తుంటాడు. అయితే ఇదే యాప్ ద్వారానే చెన్నైకి చెందిన మైథిలి (అనంతిక సనీల్‌కుమార్) అనే అమ్మాయితో అతనికి పరిచయం ఏర్పడుతుంది. ఈ పరిచయం ఇద్దరి మధ్య మరింత స్ట్రాంగ్ అవుతుంది. మైథిలి పుట్టినరోజున ఆమెని సర్‌ప్రైజ్ చేయాలని చెన్నై వెళతాడు. ఓ హోటల్‌లో ఉన్న అన్వేష్‌ని మైథిలి కలుస్తానని చెబుతుంది. కానీ మైథిలి హోటల్‌కు రాకుండా ఫోన్ స్వీచ్ఛాఫ్ చేసి, సోషల్ మీడియా అకౌంట్లలోనూ అన్వేష్‌ని బ్లాక్ చేసేస్తుంది. అయితే మైథిలి హోటల్‌కు రాకపోవడానికి కారణం ఏమిటి? ఆమె కనిపించకపోవడానికి కారణమేమిటి? ఆమె మళ్లీ తిరిగొచ్చిందా? లేదా? అన్వేష్, మైథిలి పెళ్లి చేసుకున్నారా? లేదా? అనేది మిగతా కథ. ఈ సినిమా ఉపశీర్షిక.. ప్రేమ, హాస్యం.. ఉత్కంఠ అనే తగ్గట్టుగా దర్శకుడు ఈ మూడు అంశాలను మిక్స్ చేసి కథ రాసుకున్నాడు.అయితే ఇందులో హాస్యం మీదనే దర్శకుడు ఎక్కువగా ఫోకస్ పెట్టాడు. ప్రతి సన్నివేశంలో వినోదాన్ని పండించే ప్రయత్నం చేశాడు. అయితే ప్రేమకథ, ఉత్కంఠ అంశాలపై పెద్దగా శ్రద్ధ పెట్టలేదు. హీరో లక్ష్యమైనా స్టార్టప్ కంపెనీతో మొదలైన కథలో ఆ తరువాత దాని ఊసే ఉండదు. ఫ్రెండ్స్ మధ్య సరదా సంభాషణలు, హీరో, హీరోయిన్‌ల మధ్య ఫోన్ సంభాషణలుతో కథ నడుస్తుంటుంది.అయితే హీరో, హీరోయిన్ మధ్య వచ్చే సన్నివేశాలు అంత లాజిక్‌గా అనిపించవు. ఆ సన్నివేశాలు కూడా పెద్దగా ఆకట్టుకోవు. ఇలాంటి మైనస్‌లు ఆలోచించే లోపే వచ్చే ఎంటర్‌టైన్‌మెంట్ సీన్స్ ఈ మైనస్‌లను కవర్ చేసే విధంగా కడుపుబ్బా నవ్విస్తాయి. జెన్‌జీ కుర్రాళ్ల అల్లరి, వాళ్ల సరదా డైలాగులు ప్రేక్షకులకు కావాల్సినంత వినోదాన్న అందిస్తాయి. ఫస్టాఫ్ వరకు సరదాగా, చిన్న ఉత్కంఠతో ముగుస్తుంది. ఇక సెకండాఫ్‌లోనే దర్శకుడికి అసలైన చాలెంజ్. సెకండాఫ్‌లో దర్శకుడు అసలు కథలోకి వెళతాడా? ఎలా ఉండబోతుంది అనే ఆసక్తి ప్రేక్షకులకు కలుగుతుంది. అయితే సెకండాఫ్‌లో కూడా ఉత్కంఠ, ప్రేమ అంశాలపై కంటే వినోదం వైపే మొగ్గు చూపాడు దర్శకుడు. ఉపేంద్ర లిమాయేని పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా చూపించి కామెడీ పండించే ప్రయత్నం చేసినా అది గందరగోళంగా అనిపిస్తుంది. అతను కనిపించే సన్నివేశాల్ని పెద్ద సౌండ్‌లతో స్క్రీన్ అంతా హడావుడిగా కంగాళి ఫీల్ కలుగుతుంది. సెకండాఫ్‌లో కూడా ఫ్రెండ్స్ మధ్య వచ్చే కామెడీ, రిజనల్ ఫీలింగ్‌తో వచ్చే సాంబార్, బిరియానీ, మటన్ సంభాషణలకు హిలేరియస్‌గా నవ్వుకుంటారు.సుమంత్ ప్రభాస్ నటనలో ఈజ్ కనిపించింది. అనంతిక సనీల్‌కుమార్ స్క్రీన్ ప్రెజెన్స్ బాగుంది. ఇద్దిర పెయిర్ కూడా క్యూట్‌గా ఉంది. సుమంత్ ప్రభాస్ కామెడీ, ఫ్రస్టేషన్ మిక్స్‌డ్ సీన్స్‌ల్లో అక్కడక్కడా మెప్పించిన.. నటనలో ఇంకా బెటర్ అవ్వాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా హీరో ఫ్రెండ్స్‌గా నటించిన వెంకటేష్, నరేంద్ర రవి, మణి, సోహన్ మంచి వినోదాన్ని పండించారు.ఇందులో నరేంద్ర రవి నటన, అతని సంభాషణలు ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయి. రాధారమణ పాట చిత్రీకరణ బాగుంది.దర్శకుడు కథను సింపుల్‌గా రాసుకున్నా వినోదాత్మక సంభాషణలు అలరించే విధంగా తీర్చిదిద్దుకున్నాడు. దర్శకుడు హాస్యంపై పెట్టిన దృష్టి, ప్రేమ, ఉత్కంఠ అంశాలపై కూడా పెట్టి ఉంటే సినిమా మరింత గ్రిప్పింగ్ అనిపించేంది. ఓవరాల్‌గా ఈ రోమాంచకం వినోదాత్మక చిత్రాలను ఇష్టపడే వారికి, కథ, లాజిక్‌లు, ట్విస్ట్‌లు అని ఆలోచించకుండా కేవలం వినోదాన్ని ఆశిస్తే మాత్రం 'రోమాంచకం' సంతృప్తినిస్తుంది.

# భారత్‌కు 2027 ఉమెన్స్ ఛాంపియన్స్ ట్రోఫీ

**లంకకు రూ.188 కోట్ల నష్టం**

శ్రీలంక క్రికెట్‌కు ఐసీసీ భారీ షాక్ ఇచ్చింది. తొలిసారిగా నిర్వహించనున్న మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ-2027 ఆతిథ్య హక్కులను శ్రీలంక నుంచి వెనక్కి తీసుకుంది. ఈ ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్‌ను భారత్‌కు కేటాయిస్తున్నట్లు ఐసీసీ బోర్డు అధికారికంగా ప్రకటించింది. ఈ నిర్ణయంతో శ్రీలంక సుమారు 20 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 188కోట్లు) ఆదాయాన్ని కోల్పోనుంది.శ్రీలంక క్రికెట్ (ఎస్ఎల్‌సీ) పాలనా వ్యవహారాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ జోక్యమే ఈ నిర్ణయానికి ప్రధాన కారణం. ఐసీసీ నిబంధనల ప్రకారం, క్రికెట్ బోర్డుకు ఎన్నికైన పాలకవర్గం ఉండాలి. కానీ, శ్రీలంకలో ప్రస్తుతం ప్రభుత్వంచే నియమించబడిన 'ట్రాన్స్‌ఫర్మేషన్ కమిటీ' బోర్డు వ్యవహారాలను పర్యవేక్షిస్తోంది. దీనిపై ఐసీసీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆతిథ్య హక్కులను భారత్‌కు బదిలీ చేసింది. ఈ టోర్నమెంట్ 2027 ఫిబ్రవరి 14 నుంచి 28 వరకు ముంబై, వడోదర వేదికలుగా జరగనుంది.'శ్రీలంక డైలీ మిర్రర్' కథనం ప్రకారం.. రాజకీయ జోక్యాన్ని పరిష్కరించుకుని, బోర్డు ఎన్నికలు నిర్వహించకపోతే ఆతిథ్య హక్కులను కోల్పోతారని ఐసీసీ కొన్ని నెలల క్రితమే శ్రీలంక క్రికెట్‌కు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసింది. అయితే, ఈ విషయాన్ని మధ్యంతర కమిటీ.. అక్కడి క్రీడా మంత్రిత్వ శాఖ లేదా అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే దృష్టికి తీసుకెళ్లలేదని ఆ కథనం పేర్కొంది. ఈ నిర్ణయం వల్ల పర్యాటకం, వాణిజ్య కార్యకలాపాల ద్వారా లభించే సుమారు 20 మిలియన్ డాలర్ల ఆదాయాన్ని శ్రీలంక కోల్పోనుందని అంచనా.లంక క్రికెట్‌లో ప్రభుత్వ జోక్యం కారణంగా ఆ దేశం మెగా టోర్నీలను కోల్పోవడం ఇది రెండోసారి. గతేడాది ఇదే కారణంతో 2024 పురుషుల అండర్-19 ప్రపంచకప్‌ను శ్రీలంక నుంచి దక్షిణాఫ్రికాకు ఐసీసీ తరలించింది. మూడేళ్ల వ్యవధిలో రెండు కీలకమైన ఐసీసీ ఈవెంట్‌లను కోల్పోవడం శ్రీలంక క్రికెట్‌కు పెద్ద ఎదురుదెబ్బగా విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం లంక క్రికెట్ బోర్డులో రాజ్యాంగ సంస్కరణలు, కొత్త ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించారు. ఇక, ఈ టోర్నమెంట్‌లో మొత్తం ఆరు జట్లు పాల్గొంటాయి. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, భారత్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా జట్లు ఇప్పటికే అర్హత సాధించాయి. ఆరో స్థానం కోసం ఐసీసీ ర్యాంకింగ్స్‌లో ఆరు, ఏడు స్థానాల్లో ఉన్న వెస్టిండీస్, శ్రీలంక పోటీ పడనున్నాయి. ఆతిథ్య హక్కులు కోల్పోయినప్పటికీ, ర్యాంకింగ్స్ ఆధారంగా అర్హత సాధిస్తే ఈ టోర్నీలో ఆడే అవకాశం శ్రీలంకకు ఉంటుంది.

# రోహిత్ శర్మ రిటైర్‌మెంట్‌పై క్లారిటీ ఇచ్చిన బీసీసీఐ



స్పోర్ట్స్ డెస్క్: బీసీసీఐ ఉన్నత స్థాయి సమావేశం ఇవాళ(గురువారం) ముంబైలో జరిగింది. ఈ చర్చలో రోహిత్ శర్మ రిటైర్‌మెంట్‌పై గురించి ప్రస్తావనకు వస్తుందని అంతా భావించారు. అయితే హిట్ మ్యాన్ అంశంమే ప్రస్తావనకు రాలేదు. కేవలం టీమిండియా భవిష్యత్ ప్రణాళికపై, ఆటగాళ్ల గాయాల గురించే ప్రస్తావనకు వచ్చింది. ఇక సమావేశం అనంతరం రోహిత్ శర్మ రిటైర్‌మెంట్ గురించి మీడియా ప్రస్తావించగా.. బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా క్లారిటీ ఇచ్చారు.బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా మీడియాతో మాట్లాడుతూ.. 'రోహిత్ శర్మ బాగా ఆడుతున్నాడు. ఊహాగానాలకు నేను ఆజ్యం పోయాలనుకోవడం లేదు. అతడు అన్ని మ్యాచ్‌లలోనూ మంచి ప్రదర్శనలు ఇస్తున్నాడు. ఇంతకంటే ఇంకేం కావాలి?. ఇటీవలే లార్డ్స్‌లో జరిగిన వన్డేలో అతడు 130-140 పరుగులు సాధించాడు. అయినా ఇంకా వదంతూలు ఎందుకు ప్రచారం?. అలాంటి వార్తలను వ్యాప్తి చేసే వారికి నేను ఊతం ఇవ్వాలని అనుకోవడం లేదు' అని సైకియా పేర్కొన్నారు.మొత్తంగా ప్రస్తుతం రోహిత్ ఫామ్, అందుబాటుపై బీసీసీఐ సానుకూలంగానే ఉన్నట్లు సైకియా వ్యాఖ్యలు సూచిస్తున్నాయి. ఇదిలా ఉంటే.. అజిత్ అగార్కర్ సమావేశానికి హాజరుకాకపోవడంపై కూడా సైకియా స్పందించారు. మీటింగ్ గురించి ముందుగా సమాచారం ఇవ్వలేకపోయామని, అందుకే అగార్కర్ రాలేదని వెల్లడించారు.

## SPORTS

# సెలక్టర్ల నిర్ణయంపై రోహిత్ ఆగ్రహం

**'పీటీఐ' కథనంలో సంచలన విషయాలు!**



భారత వన్డే జట్టులో ఓపెనర్ రోహిత్ శర్మ భవిష్యత్తుపై ఇటీవల చెలరేగిన దుమారానికి సంబంధించి మరిన్ని ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ఏడాది ఇంగ్లండ్ పర్యటన సందర్భంగా, భారత సెలక్షన్ కమిటీ రోహిత్ శర్మతో మాట్లాడిందని, తమ భవిష్యత్ ప్రణాళికల్లో అతడు లేడని స్పష్టం చేసిందని తాజా నివేదికలు చెబుతున్నాయి. వచ్చే ఏడాది జరగనున్న వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని, యశస్వి జైస్వాల్ వంటి యువ బ్యాటర్‌కు అవకాశం ఇవ్వాలని సెలక్టర్లు భావించినట్లు తెలిసింది.పీటీఐ వార్తాసంస్థ కథనం ప్రకారం.. సెలక్టర్ల నిర్ణయంపై రోహిత్ శర్మ మొదట తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. తన ఫిట్‌నెస్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, దేశానికి ప్రాతినిధ్యం వహించడానికి తాను ఎంతో ఆసక్తిగా ఉన్నానని చెప్పినట్లు సమాచారం. అయితే, కొంత చర్చల తర్వాత సెలక్టర్ల నిర్ణయానికి ఆయన చివరికి అంగీకరించినట్లు ఆ కథనం పేర్కొంది.ఈ పరిణామం తర్వాత జులై 19న లార్డ్స్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన మూడో వన్డేనే రోహిత్ కెరీర్‌లో చివరి మ్యాచ్ అంటూ మీడియాలో వార్తలు గుప్పుమన్నాయి. సోషల్ మీడియాలో, అభిమానుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వెంటనే జోక్యం చేసుకున్నాడు. రోహిత్ రిటైర్మెంట్ వార్తలను ఖండించాడు. జట్టు ప్రణాళికల్లో ఉన్నంతకాలం రోహిత్ ఆడతాడని స్పష్టం చేశాడు.ఈ తీవ్ర ఒత్తిడి, విమర్శల నడుమ, రోహిత్ తనపై వస్తున్న ఊహాగానాలకు బ్యాట్‌తోనే గట్టి సమాధానం చెప్పాడు. కీలకమైన మ్యాచ్‌లో సెంచరీ సాధించి, తన రిటైర్మెంట్ చర్చలకు ప్రస్తుతానికి తెరదించాడు.

**నా పని బ్యాట్‌తోనే: రోహిత్**

ఈ పరిణామాలపై బీసీసీఐ సైతం రోహిత్ మాట్లాడిన ఒక వీడియోను విడుదల చేసింది. తన భవిష్యత్తుపై వస్తున్న వార్తలను అతడు 'అనవసరపు రొద' గా కొట్టిపారేశాడు. "చూడండి, నా పని బ్యాట్‌తోనే. మైదానంలోకి వచ్చి దేశం కోసం, జట్టు కోసం ఆడటం నా బాధ్యత. నేను అరంగేట్రం చేసినప్పటి నుంచి నాకు ఇదే చెప్పారు.. నేను అదే చేస్తాను" అని రోహిత్ అన్నాడు."నేను ఆడిన మొదటి మ్యాచ్ నుంచి ఈ రొద ఉంది. నేను ఆడుతున్నంత కాలం ఇది ఉంటూనే ఉంటుంది. కాబట్టి దాని గురించి పెద్దగా పట్టించుకోను. నేను మైదానంలో ఏం చేస్తానన్నదే ముఖ్యం. జట్టు విజయానికి దోహదపడటమే నా లక్ష్యం" అని రోహిత్ వివరించాడు.